



PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 34, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజిలు : 8, వెల రూ. 5, మంగళవారం - 08 - జూలై - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఈ విషయంలో కేంద్రం నిస్సహాయ స్థితిలో ఉంది ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేకపోతున్నామన్న ఉపరాష్ట్రపతి

మూడు దశాబ్దాల నాటి సుప్రీంకోర్టు తీర్పే ఇందుకు కారణమని వెల్లడి

జడ్జి అధికారిక నివాసంలో భారీగా నగదు దొరకడం ఘోరమైన నేరమని వ్యాఖ్య

న్యాయమూర్తులను కాపాడాలి కానీ, ఇలాంటి ఘటనలు ఆందోళనకరం అన్న ధన్‌ఖడ్



2లో

## ఏపీలో సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్..

2లో

**త్వరలో అమలులోకి!**

తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరగకుండానే భూమి రిజిస్ట్రేషన్!

సీఎం చంద్రబాబు ఆదేశాలు.. సచివాలయాల్లో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు గ్రీన్ సిగ్నల్

రూ.10 లక్షల లోపు ఆస్తికి రూ.100, ఆపైతే రూ.1000 రుసుము



# అద్దె కూడా చెల్లించలేని దీనస్థితిలో రేవంత్ సర్కార్


- కిరాయి కట్టడం లేదని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తాళం
- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు లో తాజా సంఘటన
- ప్రభుత్వ ఖజానాను దివాలా స్థితికి చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం



రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తాళం వేస్తున్న యజమాని రాజు

**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు:** అద్దె చెల్లించాలని పలుమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి స్పందన లేకపోవడంతో విసిగి వేసారిన ఒక భవన యజమాని అద్దె భవనంలో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తాళం వేశాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని ఇనాం గూడ గ్రామానికి చెందిన పిట్టల రాజు ముదిరాజ్ యొక్క భవనంలో అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని అద్దెకు నిర్వహిస్తున్నారు. గత 38 నెలలుగా అధికారులు భవన యజమానికి అద్దె చెల్లించడం లేదు. భవనం యొక్క లోను ఈఎంఐ కూడా కట్టలేక పోతున్నానని ఎలాగైనా తనకు రావాల్సిన అద్దె మొత్తాన్ని చెల్లించాలని గతంలో చాలాసార్లు ప్రాధేయపడ్డాడు. భవన యజమాని లిఖిత పూర్వకంగా గత నెలలో అధికారులకు విన్నవించుకున్నాడు. కానీ అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో చేసేదేమీ లేక సోమవారం ఉదయం కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశాడు. దీంతో సబ్ రిజిస్టర్ తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నడంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భవన యజమాని రాజును అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. స్థానిక నాయకుల చొరవతో యజమానిని వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు రావాల్సిన అద్దె డబ్బులను చెల్లించాలంటూ మొరపెట్టుకున్నాడు.

"నన్ను కోసిన ఒక్క రూపాయి కూడా లేదు " అని సాక్షాత్తు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సభలో అన్న మాటలు నిజమయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఈ తాజా సంఘటనే అందుకు నిదర్శనం. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు అటు ఉంచితే.. అద్దె భవనాలలో కొనసాగిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల కిరాయిలు కూడా చెల్లించలేని దివాళా స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం చేరిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.





అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ( ఫైల్ ఫోటో )

### ప్రభుత్వ ఖజానాను దివాలా స్థితికి చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ ఖజానాను రేవంత్ రెడ్డి సర్కార్ దివాలా స్థితికి తీసుకొచ్చిందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఆదాయ వనరుల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అత్యంత ప్రధానమైనది. అలాంటి శాఖ కార్యాలయాల అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. అందుకు నిదర్శనం అబ్దుల్లాపూర్ మెట్ లో తాజాగా జరిగిన ఈ సంఘటన ఒకటైతే.. ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న భవనాన్ని కూడా నిర్మించలేక మధ్యలోనే వదిలేసిందన్నారు. రాష్ట్రం మొత్తంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రజల నుండి రిజిస్ట్రేషన్ ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేసి అద్దె చెల్లించలేక ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కూడా భారమైందంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనమేనని అన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ రాష్ట్రానికి ఎన్నో ఆదాయ వనరులను, ఆస్తులను సృష్టిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటన్నిటినీ నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును దోచుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ కమిషన్లు మెక్కుతున్నారని ఆరోపించారు. అద్దెలు కూడా చెల్లించలేక ప్రభుత్వ కార్యాలయాలను నడిపించలేని అసమర్థ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏ విధంగా నడిపిస్తుందని మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రశ్నించారు.



బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి

## అమరావతిలో దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్ బెడ్

**గేట్ వే హబ్‌గా అమరావతి అభివృద్ధికి ఏపీ ప్రభుత్వ ఆమోదం**

క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌కు గ్రీన్ సిగ్నల్

కీలక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ఏడాదిలోగా అమరావతిలో 'క్యూ-చిప్-ఇన్'**





అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. మిగతా..2లో

## బ్రిక్స్ కూటమిలో కొత్త సభ్యదేశం...

**ఇండోనేషియాకు స్వాగతం పలికిన ప్రధాని మోదీ**

బ్రిక్స్ కూటమిలో పూర్తిస్థాయి సభ్యదేశంగా అధికారికంగా చేరిన ఇండోనేషియా

బ్రెజిల్ సదస్సులో ఇండోనేషియా అధ్యక్షుడికి స్వాగతం పలికిన ప్రధాని మోదీ

సదస్సులో మోదీ పాల్గొనడంపై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ప్రత్యేక ప్రశంసలు

**2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టనున్న భారత్**



ఢిల్లీ: అంతర్జాతీయంగా వేగంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్న బ్రిక్స్ కూటమి మరింత విస్తరించింది. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరుగుతున్న 17వ బ్రిక్స్ సదస్సులో ఇండోనేషియా పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ పరిణామం బహుళపక్ష వేదికలపై భారత్ కు పెరుగుతున్న దౌత్యపరమైన పలుకుబడికి నిదర్శనమని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సదస్సు వివరాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (ఆర్థిక సంబంధాలు) దమ్ము రవి మీడియాకు వెల్లడించారు. "సదస్సులో తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి బ్రెజిల్ అధ్యక్షుడు మిగతా..2లో



## టెక్సాస్‌లో వరద బీభత్సం

2లో

28 మంది చిన్నారులు సహా 80 మంది మృతి

కళ్ల ముందే వంతెన గల్లంతు..

కెమెరాకు చిక్కిన భయానక దృశ్యాలు

సమ్మర్ క్యాంపు నుంచి 27 మంది బాలికలు గల్లంతు

కొద్ది గంటల్లోనే 10 అంగుళాల భారీ వర్షపాతం



తెలంగాణ కాంగ్రెస్‌లో

## కీలక నియామకాలు..

**ఉమ్మడి జిల్లాలకు కొత్త ఇన్‌ఛార్జ్‌లు**

- సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ దృష్టి
- 10 ఉమ్మడి జిల్లాలకు కొత్త ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- జగ్గారెడ్డి, పొన్నం ప్రభాకర్‌లకు కీలక బాధ్యతలు
- ఇన్‌ఛార్జ్‌లతో మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్
- గ్రామ స్థాయి నుంచి కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు
- వెంటనే రంగంలోకి దిగాలని నేతలకు ఆదేశం

హైదరాబాద్: తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్ఠం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కీలక చర్యలు చేపట్టింది. సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన టీపీసీసీ, తాజాగా 10 ఉమ్మడి జిల్లాలకు మిగతా..2లో

# వనం పెంచితేనే మనం క్షేమంగా ఉంటాం

**సీఎం రేవంత్ చేతుల మీదుగా వన మహోత్సవం ప్రారంభం**

తెలంగాణలో ప్రారంభమైన వన మహోత్సవం కార్యక్రమం

ఈ ఏడాది 18.03 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం

రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీలో మొక్కలు నాటిన సీఎం రేవంత్

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి తల్లి తమ ఇంట్లో రెండు మొక్కలు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయ వర్సిటీలో మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వనం పెంచితేనే మనం క్షేమంగా ఉంటామన్నారు. తల్లులు మొక్కలు నాటితే పిల్లలను చూసుకున్నట్లే జాగ్రత్తగా సంరక్షిస్తారని చెప్పారు. పిల్లలు కూడా తమ తల్లుల పేరు మీదుగా మొక్కలు నాటి రక్షించాలని పేర్కొన్నారు. "రాష్ట్ర మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టాం. పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల్లో.. వారితో ఇందిరా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయించాం. మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయించి.. మిగతా..2లో

## హైకోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ పూర్తి..

## తీర్పుపై ఉత్కంఠ




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమోదైన పరువు నష్టం కేసులో కీలక పరిణామం

కేసు కొట్టివేయాలన్న పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటన

# అమరావతిలో దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్ బెడ్

## గేట్ వే హబ్‌గా అమరావతి అభివృద్ధికి ఏపీ ప్రభుత్వ ఆమోదం




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమరావతిని 'క్వాంటమ్ గేట్ వే హబ్'గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రూపొందించిన 'క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది. గత నెల జూన్ 30న విజయవాడలో జరిగిన క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఈ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం ద్వారా అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి ప్రభుత్వం మార్గాన్ని సుగమం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగంగా, దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్ బెడ్ అయిన 'క్యూ-చిప్-ఇన్'ను రాబోయే 12 నెలల్లోగా అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో క్వాంటమ్ టెక్నాలజీ సంబంధించిన పరిశోధన, ఆవిష్కరణలు, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ నిర్ణయంతో భవిష్యత్ టెక్నాలజీ రంగంలో అమరావతి కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

# కేంద్రమంత్రికి కీలక విజ్ఞప్తి!



హైదరాబాద్: తెలంగాణలో క్రీడారంగానికి పెద్దపీట వేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సమావేశమయ్యారు. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా మార్చేందుకు అవకాశం కల్పించాలని ఈ భేటీలో ఆయన కేంద్రమంత్రిని కోరారు. రాష్ట్రంలో 'ఖేలో ఇండియా'తో పాటు ప్రతిష్ఠాత్మకమైన 40వ జాతీయ క్రీడలను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ విన్నవించారు. ఈ మెగా ఈవెంట్ల నిర్వహణకు తెలంగాణ అన్ని విధాలా సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. క్రీడల నిర్వహణకు అవసరమైన శిక్షణ, వసతుల కల్పన కోసం 'ఖేలో ఇండియా' పథకం కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా, జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులకు గతంలో రైలు ఛార్జీల్లో అందిస్తున్న రాయితీని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎందరో క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

# టెక్సాస్ వరద బీభత్సం..

## 28 మంది చిన్నారులు సహా 80 మంది మృతి

అమెరికా: అమెరికాలోని సెంట్రల్ టెక్సాస్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో చిన్నారులతో సహా 80 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 27 మంది బాలికలు గల్లంతయ్యారు. వరదల తీవ్రతకు అద్దం పడుతూ, కేవలం రెండు నిమిషాల్లో ఓ భారీ వంతెన నది మింగేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. జూలై 4న టెక్సాస్‌లో కొద్ది గంటల వ్యవధిలోనే 10 అంగుళాల భారీ వర్షం కురిసింది. ఆ ప్రాంతంలో మూడో వంతు వార్షిక వర్షపాతంతో ఇది దాదాపు సమానం. దీంతో నదులు ఒక్కసారిగా ఉప్పొంగి ఆకస్మిక వరదలు సంభవించాయి. ముఖ్యంగా కెర్ కౌంటీలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఈ ఒక్క కౌంటీలోనే 40 మంది పెద్దలు, 28 మంది చిన్నారులు మరణించినట్టు కౌంటీ షెరిఫ్ లారీ లీథా ధృవీకరించారు. గ్వాడలుపే నది ఒడ్డున ఉన్న ఓ క్రిస్టియన్ సమ్మర్ క్యాంప్ నుంచి 27 మంది బాలికలు గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సీఎన్ఎన్ నివేదికలు తెలిపాయి. మరోవైపు, కింగ్స్‌ల్యాండ్‌లోని లానో నదిపై ఉన్న ఓ రోడ్డు వంతెనను ఉప్పొంగిన వరద కేవలం రెండు నిమిషాల్లోనే పూర్తిగా ముంచెత్తిన దృశ్యాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. ప్రశాంతంగా ఉన్న నది ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చి వంతెనను కబళించడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది.

# స్వర్ణకారుల ఆత్మహత్యలపై కవిత ఆందోళన

హైదరాబాద్: రాష్ట్రంలో స్వర్ణకారులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడటంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల వేధింపులు, తప్పుడు కేసుల కారణంగానే వారు ప్రాణాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. అమాయకులైన స్వర్ణకారులపై వేధింపులకు కారణమవుతున్న సెక్షన్ 411 చట్టాన్ని తక్షణమే సవరించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, "అసలు దొంగలను పట్టుకోవడం చేతకాని పోలీసులు, వారు అమ్మిన దొంగ సొత్తును కొన్నారనే నెపంతో స్వర్ణకారులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరం" అని విమర్శించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా నిలబడాలని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆమె స్వర్ణకారులకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సంస్థల పోటీని తట్టుకోలేక విశ్వకర్మలు, ఇతర చేతివృత్తుల వారు తీవ్రంగా నష్టపోతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక రుణాలు అందించి ఆదుకోవాలని సూచించారు. తాను నిజామాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు స్వర్ణకారులను పోలీసులు ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకున్నానని గుర్తుచేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా, బీసీల తరఫున పోరాడే నాయకురాలిగా సెక్షన్ 411 సవరణ కోసం తన పోరాటం కొనసాగిస్తానని ఆమె హామీ ఇచ్చారు. చేతివృత్తుల వారిని ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆమె కోరారు.

# హైకోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ పూర్తి.. తీర్పుపై ఉత్కంఠ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమోదైన పరువు నష్టం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆయన హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సోమవారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న న్యాయస్థానం, తుది తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలపై బీజేపీ నేత వాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం కేసు దాఖలు చేశారు. కింది కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం, వాదనలు పూర్తవడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

# ఏపీలో సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్.. త్వరలో అమలులోకి!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వారసులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తమ గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు, రిజిస్ట్రేషన్ కింద నామమాత్రపు ఫీజు వసూలు చేయాలని నిర్ణయించారు. మార్కెట్ విలువ ప్రకారం ఆస్తి విలువ రూ.10 లక్షల లోపు ఉంటే కేవలం రూ.100, అంతకు మించి ఉంటే రూ.1000 స్టాంపు డ్యూటీగా చెల్లిస్తే సరిపోతుంది. యజమాని మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు వారసులందరూ ఏకాభిప్రాయంతో రాతపూర్వకంగా వస్తే, సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. గతంలో తహసీల్దార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే తీవ్ర జాప్యం జరుగుతోందని, సిబ్బంది పదేపదే తిప్పిస్తున్నారని ప్రభుత్వానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయగానే భూ రికార్డుల్లో వివరాల నమోదు (మ్యుటేషన్) ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. దీంతో పాటు వారసులకు ఈ-పాస్‌బుక్ కూడా జారీ చేస్తారు. ఈ విధానం అమలులోకి రావడానికి మరో రెండు, మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖ మార్గదర్శకాలు విడుదల చేశాక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ దీనిని అమలు చేస్తుంది. స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. కేవలం వారసత్వ ఆస్తులకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని, ఇతర రిజిస్ట్రేషన్లు యథావిధిగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# ఈ విషయంలో కేంద్రం నిస్సహాయ స్థితిలో ఉంది



కేరళ : జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నగదు దొరికిన కేసులో ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాల క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పు కారణంగా న్యాయవ్యవస్థ అనుమతి లేకుండా న్యాయమూర్తిపై కేసు నమోదు చేయడానికి వీల్లేకుండా పోయిందని ఆయన అన్నారు. సోమవారం కేరళ పర్యటనలో భాగంగా కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ వర్మ కేసును ప్రస్తావిస్తూ, ఓ హైకోర్టు న్యాయమూర్తి అధికారిక నివాసంలో అంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం 'ఘోరమైన నేరం' అని అభివర్ణించారు. "ఆ డబ్బు ఎక్కడిది? దాని మూలాలేంటి? ఒక న్యాయమూర్తి ఇంటికి అది ఎలా చేరింది?" అని ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఘటనలో పలు చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని, దీనిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. "కేంద్ర ప్రభుత్వం చేతులు కట్టేసినట్లుగా ఉంది. 90వ దశకంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పు కారణంగా మేం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేకపోతున్నాం. నేను న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, న్యాయమూర్తుల రక్షణను గట్టిగా సమర్థిస్తాను. అనవసరమైన వ్యాజ్యాల నుంచి వారిని కాపాడాలి. కానీ ఇలాంటి తీవ్రమైన ఘటనలు జరిగినప్పుడు మౌనంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది," అని ధన్‌ఖడ్ అన్నారు. మార్చి 14, 15 తేదీల మధ్య రాత్రి న్యాయవ్యవస్థకు ఒక చీకటి రాత్రి అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో జస్టిస్ వర్మ ఢిల్లీ నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు, బయట ఉన్న ఓ గదిలో కాలిపోయిన నోట్ల కట్టల సంచులు బయటపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ విచారణ జరుపుతోంది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు గతంలోనే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సూచించారు..

## దలైలామాకు మోదీ శుభాకాంక్షలు..


# భారత్‌కు చైనా తీవ్ర నిరసన



ఢిల్లీ: టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా 90వ పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలపడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం నాడు భారత్‌కు తమ నిరసనను అధికారికంగా తెలియజేసినట్లు ప్రకటించింది. టిబెట్‌కు సంబంధించిన అంశాల సున్నితత్వాన్ని భారత్ పూర్తిగా అర్థం చేసుకోవాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ హెచ్చరించారు. బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ "14వ దలైలామా మతం ముసుగులో చాలా కాలంగా చైనా నుంచి టిబెట్‌ను వేరుచేయాలని చూస్తున్న రాజకీయ ప్రవాసి, వేర్పాటువాది. ఆయన వేర్పాటువాద స్వభావాన్ని భారత్ గుర్తించాలి" అని ఆరోపించారు. ప్రధానమంత్రి మోదీ శుభాకాంక్షలు చెప్పడం, భారత ప్రభుత్వ అధికారులు దలైలామా పుట్టినరోజు వేడుకలకు హాజరుకావడంపై చైనా నిరసన తెలిపినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ఉపయోగించి తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఆపాలని భారత్‌కు సూచించారు. ఆదివారం దలైలామా 90వ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. దలైలామా ప్రేమ, కరుణ, సహనానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మశాలలో జరిగిన వేడుకలకు కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఇటీవల దలైలామా పునరావతారంపై కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యల పైనా చైనా అభ్యంతరం తెలిపింది. దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం తమ ప్రభుత్వానిదేనని చైనా వాదిస్తుండగా, అది బౌద్ధ సంప్రదాయాల ప్రకారం జరుగుతుందని భారత్, దలైలామా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# భిక్షాటన చేసే చిన్నారులకు మంత్రి లోకేశ్ అండ...

## ఆ ఇద్దరికీ వీఆర్ స్కూల్‌లో అడ్మిషన్



అమరావతి: వీధుల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఇద్దరు నిరుపేద చిన్నారుల జీవితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొత్త వెలుగులు నింపారు. చదువుకోవాలన్న వారి ఆకాంక్షను నెరవేరుస్తూ, వారికి నెల్లూరులోని ప్రతిష్టాత్మక వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్ కల్పించి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే, సోమవారం నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా, గత శనివారం తమను పాఠశాలలో చేర్పించాలని కమిషనర్‌ను కోరిన సీహెచ్ పెంచలయ్య, వి.వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్, ఆ చిన్నారులిద్దరికీ అదే పాఠశాలలో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయించారు. వారి అడ్మిషన్ ఫారాలను స్వయంగా పాఠశాల ఏపీఓ వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఈ చిన్నారుల విద్యాభ్యాసానికి పూర్తిగా అండగా ఉంటాను. వారు కష్టపడి చదువుకుని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి" అని ఆకాంక్షించారు. వారికి ఆల్ ది బెస్ట్ చెప్పినట్టు ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. మంత్రి చూపిన చొరవతో ఆ చిన్నారుల జీవితం కొత్త మలుపు తిరిగినట్లయింది.

## టీడీపీలో కష్టపడేవారికే పదవులు..

# రాజీపడే ప్రసక్తే లేదు



అమరావతి: టీడీపీలో ఇకపై కష్టపడి పనిచేసే వారికే పదవులు దక్కుతాయని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొని కీలక ప్రసంగించారు. గతంలో జరిగిన పొరపాట్లను పునరావృతం చేయబోమని, పార్టీలో ఏమైనా తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ), దేవాలయ కమిటీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు, ప్రతి నాలుగు నెలలకోసారి కార్యకర్తలు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు, ప్రతి నాలుగు నెలలకోసారి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లేలా సరికొత్త కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై లోకేశ్ విమర్శలు గుప్పించారు. "సొంత కార్యకర్తలను కారు కింద తొక్కేసిన నేత జగన్. కనీసం వారిని పరామర్శించేందుకు కూడా వెళ్లలేదు. కానీ కందుకూరు దుర్ఘటన జరిగినప్పుడు చంద్రబాబు ప్రతి ఇంటికీ వెళ్లి క్షమాపణ చెప్పారు. మనకి, వాళ్లకి ఇదే తేడా" అని లోకేశ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే ఆలోచించి, ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆయన కేడర్‌కు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఈ ఏడాదిలోనే నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేస్తున్నామని, మిగిలిన ఉద్యోగాలను కూడా పద్ధతి ప్రకారం భర్తీ చేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# బ్రిక్స్ కూటమిలో కొత్త సభ్యదేశం...

## ఇండోనేషియాకు స్వాగతం పలికిన ప్రధాని మోదీ


మొదటి పేజి తరువాయి



ఈ పరిణామం బహుళపక్ష వేదికలపై భారత్ కు పెరుగుతున్న దౌత్యపరమైన పలుకుబడికి నిదర్శనమని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సదస్సు వివరాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (ఆర్థిక సంబంధాలు) దమ్ము రవి మీడియాకు వెల్లడించారు. "సదస్సులో తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే బ్రిక్స్ కూటమిలో పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరిన ఇండోనేషియా అధ్యక్షుడికి స్వాగతం పలికారు'' అని దమ్ము రవి వివరించారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడాన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ఎంతో విలువైనదిగా భావించారని ఆయన తెలిపారు. ఈ చేరికపై ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా స్పందించారు. 'సమ్మిళిత, సుస్థిర పాలన కోసం గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సులో ప్రపంచ సవాళ్లపై సభ్య దేశాల నేతలతో అభిప్రాయాలు పంచుకున్నట్లు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. ఆర్థిక, సాంకేతిక, విద్యా రంగాల్లో జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, న్యాయమైన ప్రపంచ సహకారానికి ఇండోనేషియా కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని దమ్ము రవి పేర్కొన్నారు. వ్యవస్థాపక సభ్యదేశమైన భారత్ పాత్రను సదస్సులో ప్రత్యేకంగా గుర్తించారని తెలిపారు. ఈ సదస్సులో 11 శాశ్వత సభ్యదేశాలు, 9 భాగస్వామ్య దేశాలు, 8 ఆహ్వానిత దేశాలు, 7 అంతర్జాతీయ సంస్థల అధిపతులు పాల్గొనడం బ్రిక్స్ కు పెరుగుతున్న ప్రాముఖ్యతను సూచిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక నియామకాలు..

మొదటి పేజి తరువాయి



సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన టీపీసీసీ, తాజాగా 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే నియామకాలు చేపట్టిన కాంగ్రెస్, ఇప్పుడు జిల్లాలపై దృష్టి సారించింది. ఈ నియామకాల అనంతరం ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నూతన ఇన్‌ఛార్జ్‌లతో జూమ్ వేదికగా సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన విధివిధానాలను వారికి స్పష్టంగా వివరించారు. త్వరలోనే గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేతలంతా తక్షణమే క్షేత్రస్థాయిలో విధుల్లో చేరాలని ఆమె దిశానిర్దేశం చేశారు.

### ఉమ్మడి జిల్లాల వారీగా నియమితులైన ఇన్‌ఛార్జ్‌ల వివరాలు:

ఖమ్మం: వంశీచంద్‌రెడ్డి, నల్గొండ: సంపత్ కుమార్, వరంగల్: అడ్లూరి లక్ష్మణ్, మెదక్: పొన్నం ప్రభాకర్, హైదరాబాద్: జగ్గారెడ్డి, మహబూబ్‌నగర్: కుసుమ కుమార్, ఆదిలాబాద్: అనిల్ యాదవ్, కరీంనగర్: అద్దంకి దయాకర్, నిజామాబాద్: అజ్మతుల్లా హుస్సేన్, రంగారెడ్డి: శివసేన రెడ్డి.

# 'సీఎం పదవి'పై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు

# ఆశపడటంలో తప్పులేదుగా..

బెంగళూరు: కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై రాజకీయం ఎంతకీ తెగట్లేదు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రినని సిద్ధరామయ్య చెబుతున్నా.. తన చేతుల్లో ఏమీ లేదని డీకే శివకుమార్ అంటున్నా రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే తాజాగా డిప్యూటీ సీఎం శివకుమార్ దీనిపై మరోసారి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రిని కావాలని ప్రజలు కోరుకోవడంలో తప్పులేదన్నారు. రంభపురి పీఠాధిపతి శ్రీ రాజదేశికేంద్ర శివచార్య స్వామితో కలిసి డీకే ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ పీఠాధిపతి మాట్లాడుతూ.. "2023 ఎన్నికల తర్వాత శివకుమార్‌కు ఉన్నత పదవి దక్కాల్సింది. ఎన్నికల్లో పార్టీ విజయానికి ఆయన ఎంతగా కృషి చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసు" అన్నారు. దీనికి డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. "కార్యకర్తలు, ప్రజలు, మఠాధిపతులకు తమ తమ సొంత అభీష్టాలు ఉంటాయి. వారి ఆశలు, ఆకాంక్షలను నేను తప్పుపట్టట్లేదు. కానీ, మేమంతా కలిసికట్టుగా ఈ పార్టీ ని నిర్మించాం. ఈ పార్టీకి మేం క్రమశిక్షణ కలిగిన సైనికులం. కలిసి చర్చించుకుంటాం. పార్టీ నిర్ణయాన్ని అనుసరిస్తాం. సిద్ధరామయ్య కూడా ఇదే విషయాన్ని చాలా




సార్లు చెప్పారు" అని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఇలాంటి అనవసర విషయాలపై పార్టీ కార్యకర్తలు, ప్రతిపక్షాలు, మీడియా చర్చించకూడదని హితవు పలికారు. కాంగ్రెస్‌పై విశ్వాసంతో రాష్ట్ర ప్రజలు తమకు అవకాశం కల్పించారని డిప్యూటీ సీఎం అన్నారు. వారి అంచనాలను అందుకునేలా తాము నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవల సీఎం సిద్ధరామయ్య కూడా దీనిపై స్పందించిన సంగతి తెలిసిందే. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, అందులో సందేహం ఎందుకని అన్నారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పలువురు ఎమ్మెల్యేలు, కార్యకర్తలు బహిరంగంగానే దీనిపై వ్యాఖ్యలు చేశారు. దీంతో రాజకీయం రసవత్తరంగా మారింది. అయితే, సిద్ధరామయ్యను గద్దె దించితే పార్టీ రెండుగా చీలిపోతుందని అధిష్ఠానం భయపడుతోంది. అందుకే.. ఆయనను కొనసాగించేందుకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

# వనం పెంచితేనే మనం క్షేమంగా ఉంటాం

మొదటి పేజి తరువాయి




మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసీలో అద్దెకు తీసుకున్నాం. స్వయం సహాయక సంఘాల్లో కోటి మందిని చేర్చాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఒకప్పుడు సోలార్ పవర్ ప్రాజెక్టులు అంబానీ, అదానీ వంటి వారే ఏర్పాటు చేసేవారు. రాష్ట్రంలో మహిళలు ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తున్నాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూసింది. ఐదేళ్ల పాటు రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా చోటు ఇవ్వలేదు. రాజీవ్‌గాంధీ తెచ్చిన మహిళా రిజర్వేషన్ల బిల్లు వల్లే మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. భవిష్యత్తులో వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి గెలిపించే బాధ్యత కూడా తీసుకుంటాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

### జీవ వైవిధ్యాన్ని కాపాడాలి: కొండా సురేఖ

జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. మొక్కలు నాటి వాటిని రక్షిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని చెప్పారు. దీంతో తర్వాత తరాలకు కూడా ఉపయోగం ఉంటుందని తెలిపారు. వన మహోత్సవాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

### ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

# 31 వ ఆవిర్భావ దినోత్సవం...




చిలుకూరు ( ప్రభాత సూర్యుడు): మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేసిన ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు మాదిగ, ఎంఎస్పి జిల్లా నాయకులు సిద్దెల శ్రీను మాదిగ, చిలుకూరు మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మల్లెపంగు సూరిబాబు మాదిగ, పాల్గొని మాట్లాడుతూ 1994 జూలై 7 వ తేదీన ప్రకాశం జిల్లా ఈదు ముడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ స్థాపించిన వ్యవస్థాపకుడు గౌరవ మందకృష్ణ మాదిగ. మూడు దశాబ్దాల పోరాటంలో ఎన్నో ఒడీ దుడుకులు ఎదుర్కొన్నాడు. చిన్నపిల్లల గుండె ఆపరేషన్ కోసం చేసిన పోరాటం మందకృష్ణ మాదిగ ఫలితమే ఈరోజు ఆరోగ్యశ్రీ, అలాగే వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, పెన్షన్ పెంచాలని డిమాండ్ చేసిన ఏకైక వ్యక్తి మందకృష్ణ మాదిగ. మందకృష్ణ మాదిగ సమాజసేవ గుర్తించి పద్మశ్రీ అవార్డు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఉద్యమంలో పనిచేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు గౌరవించి శాలవాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ మౌలానా, ఎం జె ఎఫ్ మండల అధ్యక్షులు కందుకూరి కృష్ణమూర్తి, ఎంఎస్పి మండల అధికార ప్రతినిధి మల్లెపంగు ఉపేందర్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కాంపాటి రంజిత్, కందుకూరి వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి రామకృష్ణ, సిద్దెల పిచ్చయ్య, అంజయ్య, సిద్దు, శివ,రాజు, సిద్దు మరియు రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తీరు అనుమానస్పదం

**- అక్రమ వెంచర్ల పై ఎన్ని పిర్యాదులు చేసినా చర్యలు శూన్యం**

**- అక్రమార్కులకు అండగా కమిషనర్..?**

**- అక్రమ వెంచర్లపై సమగ్ర విచారణ జరపాలి**

**- బడంగ్ పేట్ కార్పోరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణ రెడ్డి డిమాండ్**



రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఏర్పడుతున్న అక్రమ వెంచర్లపై విచారణ జరిపి, వెంచర్ నిర్వాహకులకు అండగా ఉంటున్న అవినీతి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని బడంగ్ పేట్ కార్పోరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణ రెడ్డి సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ కు పిర్యాదు చేసారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 272,273,275, 276,277, 278,90 మల్లాపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 59 మరియూ బడంగ్ పేట్, నాదర్ గుల్, మామిడిపల్లి, గుర్రంగూడ తదితర ప్రాంతాలలో అక్రమంగా వెంచర్లు చేస్తున్నారని, వీటిపై అన్నిసార్లు పిర్యాదులు చేసిన కమిషనర్ స్పందించడం లేదని



తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పడుతున్నా..అధికారులు చర్యలు తీసుకోకపోవడం కమిషనర్ తీరు అనుమానాస్పదంగా ఉందని, పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అక్రమ వెంచర్లపై తక్షణం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్ పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 29, ఇతర శాఖలకు 33 మొత్తం 62 దరఖస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా సిటీ రైతులకు అండగా కాంగ్రేస్ ప్రభుత్వం

**- భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు: ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం కందుకూరు మండలంలోని మీర్ ఖాన్ పేట్ వద్ద ఫార్మా రైతుల కోసం కేటాయించిన ప్లాట్లను డ్రా పద్ధతి ద్వారా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విషం చిమ్మే ఫార్మాసిటీ వద్దని తాను మొదటి నుంచి రైతుల పక్షాన నిలబడి పోరాటం చేశానని ఆ పోరాట ఫలితంగా కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ కాకుండా గ్రీన్ ఫార్మసిటిని ఏర్పాటు చేసుకున్నామన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని, ఇక్కడి భూములు బంగారం కంటే విలువైనవిగా మారుతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఫోర్త్ సిటీ ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని దేశంలోనే అతిపెద్ద సీటీ గా పూర్తిగా ఈ ప్రాంతం అవతరిస్తుందని అన్నారు. ఈ ప్రాంతం నుంచి రేడియల్ రోడ్డు వెళు తున్నందున ఫార్మా రైతుల కోసం ఏర్పాటుచేసిన లేఔట్ లో ధరలు పెద్ద ఎత్తున పెరిగే అవకాశాలు ఉన్నాయని, రైతులు తక్కువ ధరలకు ప్లాట్లు అమ్ముకోవద్దని ఆయన రైతులకు సూచించారు. అలాగే ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం సేకరించిన 2500 ఎకరాల పట్టా భూముల రైతులను కూడా త్వరలో పిలిపించి వారితో మాట్లాడి ఒప్పించి మెప్పిస్తామని అన్నారు. రైతుల కోరుకునే విధంగా పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూముల రైతులకు కూడా అన్ని రకాలుగా న్యాయం చేస్తామని గిట్టని వారు చేస్తున్న విషప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారు, ఫ్యూచర్ సిటీ అథారిటీ చైర్మన్ శశంక, ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలు అనంత రెడ్డి , జగదీశ్వర్ రెడ్డి , డీసీపీ సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ఐక్యత చాటుతున్న ' ఆదర్శ కిరణం '

**- ఆదర్శ కిరణం బోనాలు ప్రత్యేక సంచిక విడుదల చేసిన కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : అన్ని కులాల వారిని ఆదరిస్తూ, బీసీ ఐక్యతను చాటుతున్న ఏకైక పత్రిక ఆదర్శ కిరణం మాస పత్రిక అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు. సోమవారం నగరం లోని కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన బోనాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆదర్శ కిరణం మాస పత్రిక బోనాలు ప్రత్యేక సంచికను కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి, డా.లక్ష్మణ్, నాయకులు గుండగోని భరత్ గౌడలతో కలిసి విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదర్శ కిరణం సంపాదకులు వంగల బాలరాజ్ గౌడ్ తో తమకు 30 సంవత్సరాల అనుబంధం ఉందని, ఎన్నో కథనాలను, వ్యాసాలను ప్రచురిస్తూ అన్ని కులాల, వర్గాలవారి మన్ననలు పొందుతున్నారని కిషన్ రెడ్డి కొనియాడారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజావాణి పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలి**

**మండల స్థాయిలో అధిక సమస్యలు పరిష్కారం కావాలి**



ఖమ్మం,: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2025 జనవరి నుండి ఇప్పటి వరకు పెండింగ్



ఉన్న185 ప్రజావాణి దరఖాస్తులను 7 రోజుల్లో పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలలో నమ్మకం కలిగించాలని తెలిపారు. జిల్లా అధికారులు ప్రతి వారం మండల అధికారులతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై సమీక్షించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం మండల స్థాయిలో సమర్థవంతంగా చేపట్టాలని, ప్రజల సమస్యలు చాలా వరకు మండలంలోనే పరిష్కారం కావాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ ప్రజలకు సంబంధించిన సామూహిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఒక అడుగు ముందుకు వేసి పని చేయాలని అన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న గ్యాప్స్ ను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి అధికారి చెక్ లిస్ట్ తయారు చేసుకొని ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఫీడ్ బ్యాక్ అందించాలని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామం వినోబా (నవోదయ) కాలనీ వాసులు సర్వే నెంబర్ 147, 148, 149 లో గత 11 ఏళ్లుగా భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ 2 వేల కుటుంబాలకు వంద గజాలు చొప్పున ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఆధారంగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, త్రాగునీరు, కరెంట్ వంటి మౌళిక వసతులు కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వుల ప్రకారం ప్రజలు పడుతున్న త్రాగునీరు, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం ఆర్డీఓకు



రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామానికి చెందిన పర్వత నాగమణి తన కుమారుడు శ్రీరామ్ 6వ తరగతి చదువుతున్నాడని, నాయకన్ గూడెం గురుకులంలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, బీసీ సంక్షేమ శాఖ ఆర్.సి.ఓ. రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజర్ల మండలం అన్నవరం గ్రామ పంచాయతీకి చెందిన చల్లా తిరుపతమ్మ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓకు రాస్తూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరానికి చెందిన ఎం. మల్లేశ్వరి తాను పిజి డిప్లమా



కంప్యూటర్ చేసి ఉన్నానని, ప్రైవేట్ కంపెనీలో ఐదు సంవత్సరాల పాటు పని చేశానని, ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన కంప్యూటర్ అసిస్టెంట్ గా పని చేశానని, పిఎంకేవివై సర్టిఫికెట్ ఉందని, ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా మండలం గండగలపాడు గ్రామ ప్రజలు జాతీయ రహదారి వల్ల భూములు కోల్పోయిన రైతులకు మిగిలిన భూములకు వెళ్లేందుకు మార్గం లేదని, జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు, పంట కాలువలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్డీఓ ఖమ్మంకు రాస్తూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పది రోజులలో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం రైల్వే కాలనీ గ్రామస్తులు గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయ భవనం రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములలో నిర్మించాలని, జి.పి. భవనం నిర్మాణం కోసం ప్రైవేటు స్థలాలను సేకరించవద్దని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఫోకర్స్) ప్రారంభోత్సవం

**114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఫోకర్స్) జూలై 7, 2025న ఐసిఏ ఆర్ -నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో ప్రారంభం.**

రాజేంద్రనగర్ ప్రతినిధి:ఐసిఏ ఆర్ -నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో 114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఫోకర్స్) ప్రారంభోత్సవం జసరిగింది. ఇది అకాడమీ యొక్క ప్రధాన కార్యక్రమం. ఇక్కడ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ( ఏ ఆర్ ఎస్ )లో కొత్తగా నియమించబడిన ప్రొబేషనరీ శాస్త్రవేత్తలకు ఫౌండేషన్ శిక్షణ ఇస్తారు.






హైదరాబాద్‌లోని ఐసీరిసాట్ (ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ సెమియారిడ్ ట్రాపిక్స్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ, యువ శాస్త్రవేత్తలు తమ వృత్తి ఆశయాలను నెరవేర్చుకోడానికి ఇబ్బందులను అధికమించి ఒక బృందంగా పనిచేయాలని సూచించారు. వారి కెరీర్‌లో అనేక మైలురాళ్లను సాధించడానికి విభిన్నంగా పనులు చేయాలని అన్నారు. వ్యవసాయరంగ డిమాండ్‌లను అనుగుణంగా వ్యవసాయ వృద్ధికి తోడ్పడటం తక్షణ కర్తవ్యం అన్నారు. ఈ రంగంలో ఉన్న అనేక సవాళ్లకు సరైన సమాధానాలు, మార్గాలను, పద్దతులను అభివృద్ధి చేయాలని ఆయన వర్ధమాన శాస్త్రవేత్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (హార్ట్ సైన్సెస్) డాక్టర్ హెచ్‌పీ సింగ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. పెరుగుతున్న జనాభాకు ఆహారం అందించాల్సిన అవసరం, సహజ వనరుల పరిమిత లభ్యత, సహజ వనరుల స్థిరమైన వినియోగం, మరియు అత్యాధునిక పరిశోధనల ద్వారా వ్యవసాయంలో స్థితిస్థాపకతను సులభతరం చేయవలసిన అవసరం వంటి సమకాలీన వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన విశదీకరించారు. “విక్షిత్ భారత్-2047” లక్ష్యం చేరుకోటానికి ఆయన పట్టణ ఉద్యానవనాల పరిధిని కూడా వివరించారు. ఈ రంగంలో యువ శాస్త్రవేత్తలు నాయకులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఐ సి ఏ ఆర్ -నార్మ యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ.... ఫోకర్స్ అలాగే అకాడమీ కార్యకలాపాల గురించి వివరించారు. యువ ప్రొబేషనర్లతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఏ ఆర్ ఎస్ లో అగ్రి అండ్ అల్లిడ్ సబ్జక్ట్స్ 41 విభాగాలు, దేశంలోని 21 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 105 మంది సైంటిస్ట్ ప్రొబేషనర్లు 3 నెలల వ్యవధి ఫౌండేషన్ శిక్షణ నార్మ లో పొందుతారు. ఎక్స్‌టెన్షన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ ( ఎక్స్ ఎస్ ఎం ) డివిజన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ ఆర్ వెంకటకుమార్, అకాడమీ రీసెర్చ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ ( ఆర్ ఎస్ ఎం ) డివిజన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఉమేష్ హుదేదమణి ప్రోగ్రామ్ డైరెక్టర్లుగా ఉన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అకాడమీలోని ఫ్యాకల్టీ, శాస్త్రవేత్తలు మరియు నార్మ సిబ్బంది పాల్గొన్నారు.

## మేకపాటి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మానం మస్తానయ్య

నేటి శుభోదయ(కనిగిరి/ పామూరు): ఉదయగిరి వైసిపి ఇన్చార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి లో జరిగిన నియోజకవర్గ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఉదయగిరి వైసీపీ ఇన్చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డిని, వైసిపి నెల్లూరు జిల్లా పరిశీలకులు జంకె వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన ఉదయగిరి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు మానం మస్తానయ్య. ఈ కార్యక్రమంలో దర్శి వెంకటేశ్వర్లు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు

## వి.ఎస్ కేర్ మల్టీస్పెషల్టి హాస్పిటల్ ను ప్రారంభించిన శ్రీరాములు అందెల



మహేశ్వరం ప్రతినిధి: మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో డాక్టర్ రామ్ ప్రదీప్ నూతనంగా ఏర్పాటుచేసిన వి.ఎస్ కేర్ మల్టీస్పెషల్టి హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతులు పొందాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, బీమ్ రాజ్, విజయలక్ష్మి రాజు, రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ మెంబర్ అంబోజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ రూపొందించిన సమగ్ర సమాచార సంపుటిక బుక్ లెట్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం: తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ రూపొందించిన సమగ్ర సమాచార సంపుటిక బుక్ లెట్ ను, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో నిలిపి వేసిన వారికి మరో అవకాశం కల్పిస్తూ 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసేలా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పని చేస్తుందని అన్నారు. 14 సంవత్సరాల వయస్సు నిండిన వారికి ఓపెన్ స్కూల్ 10వ తరగతి, 15 సంవత్సరాల వయస్సు నిండిన వారికి ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ లభిస్తుందని అన్నారు. ఓపెన్ స్కూల్ నందు తరగతులు సెలవు దినాల్లో ఉంటాయని, రెగ్యులర్ గా బయట పనులు చేసుకుంటూ చదువుకోవచ్చని, 10వ తరగతి ఫీజు 1500, ఇంటర్ ఫీజు 1800 రూపాయల లోపు ఉంటుందని అన్నారు. ఈ ఫీజుతో పాఠ్య పుస్తకాలను సైతం విద్యార్థులకు అందించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గలవారు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ బుక్లెట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డి.డి. అనిల్,సూపరింటెండెంట్ చావా శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథుడి కల్కి అవతారం : మారు రథయాత్ర



భువనేశ్వర్: శ్రీ గుండిచా ఆలయంలో భక్తులు శ్రీ జగన్నాథుని సంధ్యా దర్శనం కోసం తండోపతండాలుగా తరలి వచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు పరిమితం చేశారు. అడప మండపంపై ఇది చివరి దర్శనం. ఈ సందర్భంగా శారదా బాలి జనసముద్రంగా మారింది. మహా ప్రభువు దర్శనం కోసం బొడొశొంఖొ వరకు బారులు తీరారు. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా శుక్రవారం శ్రీ గుండిచా ఆలయం ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భంగా శారదా బాలి ప్రాంగణంలో భక్తుల రద్దీ నియంత్రణ, మారు రథ యాత్ర భద్రతా సన్నాహాల్ని ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. బహుడా యాత్ర పురస్కరించుకుని పోలీసులు వాహనాల రవాణా వ్యవస్థ కట్టుదిట్టం చేశారు. అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ దయాళ్ గంగ్వార్ ప్రత్యక్షంగా ఈ బాధ్యతల్ని పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి ప్రజలకు బల్క్ సందేశాలు పంపిస్తారు. జన సందోహం ఉన్న చోట డ్రోన్, సీసీటీవీ ఫుటేజ్ ద్వారా అన్ని ఫోన్లకు సందేశాలు పంపిస్తారు. అదనంగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీల ద్వారా కూడా వాహన చోదకులకు సమాచారం ప్రసారం చేస్తారు. నవమి సంధ్యా దర్శనం, మారు రథ యాత్ర బహుడా భద్రత, రక్షణల సమగ్ర వ్యవస్థని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా పర్యవేక్షించారు. జన్మ వేదికపై శ్రీ జగన్నాథుని చివరి దర్శనం క్రమబద్ధీకరణ కార్యాచరణని పరిశీలించారు. శాంతిభద్రతల ఏర్పాట్లపై ఆయన దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఇతర సీనియర్ అధికారులతో పోలీస్ డైరెక్టర్ జనరల్ సమావేశమయ్యారు.

### కల్కి అవతారంలో జగన్నాథుడు

పర్లాకిమిడి: స్థానిక గుండిచా మందిరంలో జగన్నాథ స్వామి శుక్రవారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు ఈ రోజుతో దశవతారాలు పూర్తయ్యాయి. శనివారం బహుడా యాత్ర సందర్భంగా శ్రీజగన్నాథరథాలు తిరుగుముఖం పెట్టారు. గుండిచా మందిరం వెలుపల ఆనందబజార్‌లో శుక్రవారం భక్తులకు ఉచితంగా ఓబ్బడా (అన్న ప్రసాదం) రథాయాత్ర కమిటీ అందజేసింది

## జగన్‌ను చూస్తేనే కూటమి నేతలకు భయం..
# అందుకే అడ్డుకునే ప్రయత్నం..!




**అమరావతి,:** వైఎస్ జగన్ చూస్తే కూటమి నాయకులకు భయం, అందుకే రైతుల వద్దకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి.. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు అవస్థలు పడుతున్నారు.. రైతుల కోసం బంగారుపాల్యం గ్రామనికి వస్తున్నారు.. అప్పుడే కూటమి నాయకులు రైతులను వేధింపులకు గురిచేస్తున్నారు.. జగన్‌ను చూస్తే కూటమి నాయకుల భయం అన్నారు.. మరోపక్క వైసీపీ నాయకులను భయపెడుతున్నారు.. జనసేన, టీడీపీ వారు జగన్ పర్యటన రద్దు అయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. జగన్ రావడం ఖాయం.. రైతులు కలవడం పక్కా అని స్పష్టం చేశారు.. కుమార్ అనే రైతు నష్టాలకు భరించలేక, చెట్లు నరికేశాడు.. దానికి ఫారెస్ట్ అధికారుల కుమార్ అనే రైతు నానా ఇబ్బందులు పెట్టారని విమర్శించారు భూమన కరుణాకర్ రెడ్డి.. 16 చెట్లకు గాను, 12,400 రూపాయల ఫైన్ వేసారు.. ఒకరోజు రైతును నిర్బంధం చేసారు.. ఓ మామిడి రైతు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇది అని మండిపడ్డారు.. అటవీశాఖ పవన్ కల్యాణ్ ఆధీనంలో ఉంది.. ఓ మామిడి రైతును ఎర్రచందనం స్మగ్లర్ గా చూపించారు.. బిన్ లాడెన్ పై అమెరికా దాడిచేసినట్లు, మారుమూల గ్రామంలో ఉన్న రైతును భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు నిజాలను చెబితే తట్టుకోలేకపోతున్నారు.. ఈ ప్రభుత్వం మెడలు వంచడానికి జగన్ వస్తున్నారని ప్రకటించారు.. జగన్ పర్యటన పై నిర్బంధాలు విధించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది.. జగన్ రాష్ట్రంలోనే అత్యధిక, అత్యంత ప్రజాదరణ ఉన్న వ్యక్తి.. జగన్ కు రక్షణ కల్పించాల్సిన భాద్యత మీదే.. హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామన్నారు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి..

## ట్రంప్ సుంకాలకు మోడీ తలవంచుతారు..
# రాసి పెట్టుకోవాలన్న రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ,:** సుంకాలపై ట్రంప్ విధించిన డెడ్‌లైన్ మరికొన్ని గంటల్లో ముగుస్తోంది. ఆయా దేశాలకు గడువు ముంచుకొస్తోంది. యూకే, వియత్నాం, చైనా తప్ప.. ఇంకా ఏ దేశాలు అమెరికాతో ఒప్పందాలు చేసుకోలేదు. భారత్‌తో కీలక డీల్ జరిగినట్లుగా వార్తలు వినిపిస్తున్నా.. అధికారిక ప్రకటన అయితే ఇంకా రాలేదు. వ్యవసాయం, పాడి శ్రమకు సంబంధించిన డీల్ పెట్టుకుంటే ముప్పు వాటిల్లుతుందేమోనని భారత్ భయపడుతోంది. ఒకవేళ ఒప్పందం చేసుకోకపోతే మాత్రం భారీగా సుంకాలు ఉంటాయని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య గందరగోళం నెలకొంది. తాజాగా ఇదే అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ.. మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని వ్యాఖ్యానించారు. ట్రంప్ సుంకాలకు ప్రధాని మోడీ తలవంచాల్సిందేనని.. ఇది గ్యారంటీ అని.. తన మాటల మీద నమ్మకం లేకపోతే రాసిపెట్టుకోవాలని రాహుల్‌గాంధీ సవాల్ విసిరారు. ఇక శుక్రవారం కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారతదేశం పటిష్ట విధానాలను కలిగి ఉంటుందని.. ఎప్పుడూ తొందరపడదని చెప్పారు. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటామని చెప్పారు. ఇరు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే ఒప్పందాలు అంగీకరిస్తామని తేల్చి చెప్పారు. అయితే ట్రంప్ విధించిన గడువు మరికొన్ని గంటల్లోనే ముగుస్తుంది. ఆలోపే చర్చలు ముగిస్తామని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు. అయితే పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ తాజాగా స్పందిస్తూ.. ట్రంప్ సుంకాలకు మోడీ సర్కార్ తలొగ్గాల్సిందేనని వ్యాఖ్యానించారు. అవసరమైతే రాసిపెట్టుకోవాలని సూచించారు. భారతదేశానికి వ్యవసాయం, పాడి పరిశ్రమ అనేది చాలా సెంటిమెంట్. అలాంటిది వాటిపైనే అమెరికా సడలింపు కోరుతోంది. ఒకవేళ భారత్ తలొగ్గితే.. అన్నదాతలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అందుకోసమే భారత్ తర్జనభర్జన పడుతోంది. గడువు దగ్గర పడుతున్నా.. ఎటూ తేల్చుకోలేకపోతుంది. వాస్తవానికి ఇరుదేశాల అధికారుల చర్చలైతే ముగిశాయి. చివరిగా ట్రంప్-మోడీ మాట్లాడుకునే దానిని బట్టే ఒప్పందాలు ఫైనల్ అవుతాయి. చివరికి ఏమవుతుందో చూడాలి.

# సెక్యులర్, సోషలిస్టు పదాలు మన జీవన విధానాలు




సెక్యులర్, సోషలిస్టు, అనేవి రెండు పదాలు కాదు, చేరాల్సిన గమ్యం వైపు ఐక్యమత్యంగా సాగాల్సిన జీవన విధానాలు. వీటిని రాజ్యాంగ పీఠిక నుండి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేస్తుంది. యజమాని ఆజ్ఞను అమలు చేయడం 'సేవకుల' విధి. అందుకే ఉపరాష్ట్రపతి ధన్‌ఖర్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తో పాటు అనుచర మీడియా బృందం రంగంలోకి దిగింది. ఇందిరా గాంధీ 21 నెలల ఎమర్జెన్సీని 'సంవిధాన్ హత్య' (రాజ్యాంగ హత్య గా) చెబుతున్న ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని శాశ్వతంగా హత్య చేసేందుకు సిద్ధమవుతున్నారు. జాతీయోద్యమంలో భాగస్వాములు కాని వారు, బ్రిటిష్ పాలకులకు అరడజనుసార్లు క్షమాభిక్ష వేడుకున్న వారు, స్వాతంత్ర్య సమరంలో పురుడుపోసుకున్న సోషలిస్టు, సెక్యూర్ భావాలను రద్దు చేయాలని కోరుతుండడం తీవ్ర అభ్యంతరకరం. తరాల నాటి మత రాజ్యాన్ని ఆధునిక కాలంలో నిర్మించాలనే లక్ష్యంతో పనిచేసే ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని గుర్తించడానికే చాలకాలంగా నిరాకరించింది. వాజ్‌పేయి ప్రధానిగా వున్న కాలంలోనే రాజ్యాంగ సమీక్ష పేరుతో మార్చడానికి ప్రయత్నించింది. మొన్నటి ఎన్నికల్లో 400 స్థానాలు సాధించి మొత్తం రాజ్యాంగాన్నే చుట్టచుట్టేయాలని ఆశించారు. దేశ ప్రజలు విజ్ఞతతో గత స్థానాల్లోనే 60 సీట్లు కోత కోసేశారు. అయినా బీహార్ నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ల ఊతకర్రలతో రాజ్యాధికారాన్ని నిలబెట్టుకున్నారు. బిజెపి సంఖ్యా బలం బలహీనపడినా, దాని తీరు మారకపోగా మరింత ఉధృతంగా హిందూత్వ రాజ్య నిర్మాణం వైపు పరుగులు తీస్తున్నది. రాజ్యాంగం మొత్తాన్ని తక్షణం మార్చడం సాధ్యం కాదు కాబట్టి ముక్కముక్కగా మార్చుకుంటూ వస్తున్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఒకే పన్ను, ఒకే భాష, ఒకే ఎన్నిక, ఒకే విద్య ఇలా అనేక బహుళత్వాలు ఒకే విధానంగా మారిపోతున్నాయి. ఇప్పుడు ఏకంగా రాజ్యాంగ పీఠిక మీద దాడికి సిద్ధమయ్యారు.

### సోషలిజం- సెక్యులరిజం

సోషలిజం, సెక్యులరిజం భావాలు జాతీయో ద్యమంలో పురుడు పోసుకున్నాయి. విజ్ఞప్తులు, విన్నపాలతో సాగుతున్న జాతీయోద్యమం 1905 తర్వాత క్రమంగా వేగం పుంజుకుంది. దీన్ని గమనించిన బ్రిటీష్ పాలకులు మత విభజన ద్వారా ప్రజల ఐక్యతను దెబ్బతీసి, తమ దోపిడి పాలన కొనసాగించుకోవడం కోసం 1905లో బెంగాల్ ను మత ప్రాతిపదికన విభజన చేశారు. సామ్రాజ్యవాదుల కపటత్వాన్ని కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలు ప్రతిఘటించారు. బుద్ధి మారని బ్రిటీష్ పాలకులు ఎనిమిది సంవత్సరాల వ్యవధిలో ముస్లిం లీగ్, హిందూ మహాసభ అనే మత సంస్థలకు ఊపిరి పోశారు. మత విద్వేషాలకు అంకుర్పారణ చేశారు. ఈ మత సంస్థలు మతం చాటున ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తుంటే దేశ ప్రజలు మాత్రం హిందూ, ముస్లిం, సిక్కు భాయి భాయి అంటూ నలుదిక్కులూ పిక్కటిల్లేలా నినదిస్తూ స్వాతంత్ర్యం కొరకు పోరాడారు. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత మనం నిర్మించబోయే వ్యవస్థ ఎలా వుండాలనే చర్చ జాతీయోద్యమంలో చాలా కాలంగా జరుగుతూ వచ్చింది. 1857 తిరుగుబాటు లక్ష్యం పాత భూస్వామ్య రాజరిక వ్యవస్థను పునరుద్ధరించడం. 1885 తర్వాత బ్రిటీష్ పాలన కింద ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం డిమాండ్, 1921 తర్వాత సంపూర్ణ స్వాతంత్ర్య సాధన అంతిమ లక్ష్యంగా మారింది. సంపూర్ణ స్వాతంత్ర్యం అంటే ఏమిటీ అనేదానికి భారత కమ్యూనిస్టు పార్టీ స్పష్టమైన, శాస్త్రీయమైన మార్గాన్ని చూపింది. 1922లో గయలో జరిగిన జాతీయ కాంగ్రెసు 37వ వార్షిక మహాసభలో 17 అంశాలతో కూడిన సామాజిక, ఆర్థిక ప్రణాళికను కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. ఆ అంశాలు నేటికీ ఆచరణీయమే. మన దేశంలోని భిన్న మతాలు, జాతులు వాటి ఆచారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, సాంస్కృతిక జీవన విధానాలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించకుండా ప్రజల మధ్య ఐక్యతను సాధించలేమని జాతీయోద్యమ నాయకులు గుర్తించారు. అందుకే హిందూ-ముస్లిం-సిక్కు భాయి భాయి లాంటి నినాదాలు వచ్చాయి. జీవన విధానంలో సెక్యులరిజం అంతర్భాగమైంది. సెక్యులరిజం అనే పదాన్ని రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావించలేదని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ను ఓ జర్నలిస్టు ప్రశ్నిస్తే 'రాజ్యాంగంలోని ప్రతి పదంలో సెక్యులరిజం వుందని, రాజ్యాంగానికి అదే ఆత్మ అని' జవాబిచ్చారు. భూస్వామ్య ప్రతినిధులు, సంస్థానాధీశులు రాజరికాన్ని కోరుతుంటే, నూతన వ్యాపార ధనాఢ్య వర్గాలు పెట్టుబడిదారీ వ్యవస్థను డిమాండ్ చేస్తుంటే, స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన ప్రజలు మాత్రం సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని కోరుకున్నారు. అందుకే తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తమ ప్రభుత్వ మార్గం సోషలిస్టు మార్గం అనాల్సి వచ్చింది. రాజ్యాంగ మౌలిక స్వభావంపై మరింత స్పష్టత ఇవ్వడానికి రాజ్యాంగ పీఠికలో వున్న సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర పదాలకు తోడుగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సామ్యవాద, లౌకిక, సమగ్రత' అనే పదాలను చేర్చారు. దీనిని సవాల్ చేస్తూ నాటి రాజ్యసభ ఎంపీ సుబ్రమణ్యస్వామి, అడ్వకేట్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ, బలరామ్ సింగ్ సుప్రీం కోర్టులో పిటిషన్లు వేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ తో కూడిన డివిజన్ బెంచ్ ఈ పిటషన్లను కొట్టి వేస్తూ "రాజ్యంగ పీఠిక నుండి సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించాల్సిన అవసరం లేద"ని చెప్పింది. 1994లో ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసులో "లౌకిక స్వభావం మన రాజ్యంగ మౌలిక స్వరూపం అని" మరోసారి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయినా ఆర్ఎస్ఎస్ తీరు మారలేదు. మత ప్రాతిపదికన ఏర్పడిన పాకిస్తాన్ పరిస్థితి ఏమిటో కళ్ల ముందు కనిపిస్తున్నా, మత రాజ్యాన్ని దేశంలో నిర్మించాలనుకోవడం ఏ మాత్రం విజ్ఞత అనిపించుకోదు. ప్రజలను విభజించి పాలించాలనుకున్న బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, జాతి రాజ్య నిర్మాణం పేర ఉన్మాదులుగా మారిన హిట్లర్, ముస్సోలినీలు చరిత్ర గర్భంలో కలిసిపోయిన విషయం మరువరానిది.

# మళ్లీ సుంకాల గాండ్రింపు!




ఇంటా బయటా గట్టిగా మొట్టికాయలు పడుతున్నా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ధోరణిని వీడటం లేదు. రష్యాతో వాణిజ్యం జరిపే దేశాలపై 500 శాతం పన్నులు విధిస్తామని తాజాగా ప్రకటించి, తన తెంపరితనాన్ని చాటుకున్నాడు. రష్యా వద్ద ఇండియా, చైనా 70 శాతం చమురు కొంటున్నాయని, తద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధం చేయటానికి సహాయం అందిస్తున్నాయని అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అంతే కాదుబీ భారత్‌తో తమకు లాభసాటైన రీతిలో వాణిజ్య ఒప్పందం కుదరబోతుందని, తద్వారా భారత్‌లోకి ప్రవేశించి వ్యాపారం చేయొచ్చని విలేకరుల సమావేశంలో అన్నాడు. భారత్ వాణిజ్య వ్యవహారాలపై ట్రంప్ ఇంత బాహాటంగా మాట్లాడినా- మన ప్రధాని గానీ, విదేశాంగ మంత్రి గానీ చిన్నపాటి అభ్యంతరం కూడా వ్యక్తం చేయలేదు. చమురు అయినా, మరొక వస్తువైనా ఎక్కడ కొనాలన్నది పూర్తిగా భారత్ ఇష్టం. అందులో మరొక దేశపు జోక్యానికి, నిర్ణయ నిర్దేశాలకు తావు లేదు. చమురు కొనుగోళ్ళ విషయంలో మనం అమెరికా మాట వింటే - దాని తైనాతి కంపెనీలకు అధిక ధరలు చెల్లించాల్సి ఉంటుంది. అమెరికా ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో మనకు రష్యా నుంచి గతం కన్నా తక్కువ ధరకే చమురు లభిస్తోంది. ఈ ప్రయోజనానికి పాడె కట్టేలా ట్రంప్ ఏకపక్ష వ్యాఖ్యానం చేయటం అమెరికా ఆధిపత్య ధోరణికి నిదర్శనం. గత ఏప్రిల్‌లో ప్రకటించిన ప్రతీకార సుంకాలపై ట్రంప్ తనకు తానే వెనక్కు తగ్గి అమలుకు 90 రోజుల గడువు ప్రకటించాడు. ఆ గడువు ఈనెల తొమ్మిదితో తీరిపోతోంది. ఇకపై ఎలాంటి పొడిగింపూ ఉండబోదని పెడసరంగా బయటికి చెబుతున్నా- లోలోపల భయం గంట కొడుతూనే ఉందని పరిణామాలు పట్టి చూపిస్తున్నాయి. ట్రంప్ ఏకపక్షంగా ఊపుకున్న సుంకాల కొమ్మకు అమెరికాలోని కంపెనీలే అతలాకుతలమై, వేలాది కోట్లను నష్టపోయాయి. ప్రపంచంలోని అన్ని దేశాలతోనూ లావాదేవీలు ముడిపడి ఉన్న తరుణంలో - వెర్రి బుద్ధికి ఎక్కిందే తడవుగా నిర్ణయాలు తీసుకుంటే ఏమవుతుందో అనంతర పరిణామాలు కళ్లకు కట్టాయి. అమెరికాలోనే 20 లక్షల మంది వీధుల్లోకి వచ్చి ట్రంప్ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. 12 అమెరికా రాష్ట్రాలు ట్రంప్ సుంకాలపై అభ్యంతరం వ్యక్తం చేయటమే కాదుబీ ఇది చట్టసమ్మతం కాదని కోర్టుకెక్కాయి కూడా! ఈ నేపథ్యంలోనే అమెరికా ఫెడరల్ కోర్టు తెంపరి ట్రంప్‌కి గట్టిగా తలంటింది. ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలు ఎలా ఉండాలో ప్రతినిధి సభ నిర్ణయిస్తుందని, దానికి భిన్నంగా అధ్యక్షుడు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరాదని చెక్ పెట్టింది. ట్రంప్ సుంకాలపై చైనా, కెనడా, మెక్సికో, వియత్నాం, దక్షిణ కొరియా వంటి దేశాలు ఎప్పటికప్పుడే తమ ప్రతిఘటనను స్పష్టం చేశాయి. 'మీ ఊరికి మా ఊరు ఎంత దూరమో- మా ఊరికి మీ ఊరూ అంతే దూరం' అన్న సహజ ఆత్మ గౌరవ సూత్రాన్ని ఆచరించి, చూపాయి. తమ దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఎలాంటి బెదిరింపులకు లొంగేది లేదని చైనా వెంటవెంటనే స్పష్టం చేసింది. దరిమిలా ట్రంప్ రకరకాల పిల్లిమొగ్గలతో వెనక్కు తగ్గక తప్పింది కాదు. గత నెలలో చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొని, ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగ్గా ఉన్నాయని ప్రకటించుకున్నాడు. ట్రంప్‌కు అనుంగు దోస్తులా భావించుకునే మోడీ ప్రభుత్వం మాత్రం భారత్ ఆత్మ గౌరవాన్ని తగు రీతిలో ప్రదర్శించకపోవటం విచారకరం. సుంకాల విషయంలో అమెరికా హూంకరించిన ప్రతిసారీ తమకు సంబంధం లేనట్టుగా తలొంచుకోవటం సమంజసం కాదు. చైనాతో అమెరికాకు చెడితే- ఆ వాణిజ్య అవకాశాలు మనకే వచ్చి పడతాయన్న ఉదారవాద సమర్థకుల వాదన కూడా వాస్తవంలో నిలబడేది కాదని తేలిపోయింది. అనేక దేశాలతో తనకున్న వాణిజ్యలోటును పూడ్చుకోవటానికి అదనపు సుంకాల విధింపునే ఒక అస్త్రంగా అమెరికా భావిస్తోంది. కానీ, అది ఆచరణలో అంత సులభమైన పని కాదనేది జరుగుతున్న పరిణామాలే చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్ తన ప్రజల ఆదాయాలను పెంచి, రూపాయి విలువను పెంచుకునే అంతర్గత చర్యలకు పూనుకోవాలి. అమెరికా ఒత్తిడికి లొంగిపోకుండా- తన సొంత వాణిజ్య, దౌత్య వ్యూహాలతో కూడిన విదేశాంగ విధానంతో ముందుకు సాగాలి.

# అదానీ ప్రయోజనాల కోసమే స్మార్ట్ మీటర్లు




స్మార్ట్ మీటర్ల దారిదోపిడి విధానంపై రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మడమ తిప్పింది. ప్రతిపక్షంలో వుండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఇప్పుడు మాట మార్చి పని చేస్తున్న డిజిటల్ మీటర్లను తొలగించి ప్రజల కళ్ళుగప్పి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. అదానీ కంపెనీకి స్మార్ట్ మీటర్ల నిర్వహణ కాంట్రాక్టును పదేళ్ల పాటు చంద్రబాబు ప్రభుత్వం కట్టబెట్టింది. విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు ఇది ఒక మెట్టు. దీని పేరే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకుంటేనే కరెంటు వస్తుంది. అలానే ఏనాడూ మనం చూడని విధంగా పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, వేసవి కాలం ఒక రేటు, చలికాలం మరొక రేటు వసూలు చేస్తారు. సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల మధ్య ఎక్కువ కరెంటు వినియోగిస్తారు కాబట్టి, ఆ సమయంలో మరింత ఎక్కువ చార్జీలు వసూలు చేయటానికే ఈ మోసపూరిత విధానం. విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు శక్తులకు అప్పగించటానికి మోడీ ప్రభుత్వం 2003 నాటి ఎలక్ట్రిసిటీ చట్టాన్ని మార్చి విద్యుత్ సవరణ బిల్లును ఆర్డినెన్స్ రూపంలో 2020న సంపూర్ణ లాక్‌డౌన్ సమయంలో తీసుకొచ్చింది. దీన్ని అడ్డం పెట్టుకొని దేశంలోని వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు మూడు సంవత్సరాల్లో బిగించాలని 2021 ఆగస్టు 17న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. అయితే స్మార్ట్ మీటర్లను వినియోగదారులు అంగీకరిస్తేనే బిగించాలనే నిబంధనను అదానీ సంస్థ అధికారులు గాలికి వదిలేసి విద్యుత్ అధికారుల అండతో బిగించి వెళుతున్నారు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణ, ఉచిత విద్యుత్ పథకాల తొలగింపు, పేదలకు తక్కువ రేటుకి విద్యుత్ అందించే క్రాస్ సబ్సిడీ విధానం రద్దు, అందరికీ ఒకటే శ్లాబ్, స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్రం తాఖీదులు ఇచ్చింది. అందుకు ఆర్.డి.ఎస్.ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం అమలులో భాగంగా ఆనాటి వైసిపి, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అండతో 18 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపునకు రంగం సిద్ధం చేశారు. ఒక్కొక్క మీటరు ఖర్చు, నిర్వహణ కలిపి రూ.35 వేలు నిర్ణయించారు. ఇదొక భారీ కుంభకోణం. అదానీకి, తమ బినామీ కంపెనీ షిరిడీ సాయి ఎలక్ట్రికల్ సంస్థలకు రూ.13,252 కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపుసెట్లకు మీటర్లు బిగించటంపై రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. బిగించిన మీటర్లను పీకివేశారు. ఇక గత్యంతరం లేని స్థితిలో పంపు సెట్లకు మీటర్ల బిగింపు తాత్కాలికంగా ఆగినా ఈ ప్రమాదం పొంచే ఉంది. కరెంటు చార్జీలు పెంచేది లేదని, బాదుడు ఆపుతామని గద్దెనెక్కిన టిడిపి కూటమి ప్రజలను మోసం చేసింది. అధికారంలో ఉన్న 9 నెలల్లోనే వినియోగదారులపై రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారం మోపింది. ఇదికాక 4 రకాల అదనపు సర్దుబాటు చార్జీలు 2019, 22, 23, 25 సంవత్సరాల్లో ట్రూ అప్, ఎఫ్.పి.పి.సి.ఏ చార్జీల కింద ప్రభుత్వం భరించాల్సిన చార్జీలను వినియోగదారులపై అదనంగా కోట్ల రూపాయలలో బాదుతున్నారు. ఆ విధంగా అసలు బిల్లు కంటే కొసరు బిల్లు ఎక్కువై వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఈ బాదుడుకి స్మార్ట్ మీటర్ల దోపిడీ తోడయ్యింది. మోడీ ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ లాంటి మెజారిటీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కార్ మోడీ మెప్పు కోసం, అదానీ సామ్రాజ్యాన్ని కాపాడటానికి రెట్టించిన ఉత్సాహంతో అమలు చేసే పనిలో తల మునకలై ఉంది. కేరళలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పథకాన్ని అమలు చేయటానికి నిరాకరించగా, పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయటానికి చేసిన ప్రయత్నాలను వామపక్ష సిపిఎం నాయకత్వాన విద్యుత్ ఉద్యోగుల సంఘాలు అంచలవారీ ప్రతిఘటన పోరాటాన్ని సాగించి చివరికి ఈ పథకాన్ని విరమించుకునేలా చేయగలిగారు. విద్యుత్ రంగంలో ఈ ప్రైవేటీకరణ విధానాలు అదానీ లాంటి బడా కార్పొరేట్ వర్గాలకు లాభాలు చేకూర్చటానికేనని స్మార్ట్ మీటర్ల పథకం తేటతెల్లం చేస్తున్నది. విద్యుత్ రంగంలో స్మార్ట్ మీటర్ల దారి దోపిడీ విధానాలను ఓడించటానికి%ా%2000 సంవత్సరంలో చంద్రబాబు పాలనలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ సమన్వయం చేసుకొని సాగించిన గొప్ప పోరాటం అనుభవాల వెలుగులో%ా% తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఈ పథకాన్ని తిప్పి కొట్టిన విలువైన అనుభవాలను అందిపుచ్చుకొని మరో బషీర్‌బాగ్ తరహా పోరాటానికి ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు నడుం బిగించాలి.



## బనకచర్లపై కేంద్ర అభ్యంతరాలపై ఏపీ ప్రభుత్వం కసరత్తు




**అమరావతి,:** బనకచర్ల ప్రాజెక్ట్ పై కేంద్ర జలసంఘం అభ్యంతరాలపై దృష్టి పెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. కేంద్ర అభ్యంతరాలపై ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం.. ఏపీ ఇరిగేషన్ సలహదారు అధికారులతో సమావేశం అయ్యారు.. అయితే, కేంద్ర జలసంఘం.. అడిగిన లెక్కలుపై చర్చ సాగుతోంది.. కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్.. నీటి లెక్కలపై అధ్యయనం చేస్తోంది.. ఎల్లుండికి ప్రాథమిక నివేదిక సిద్ధం చేయనున్నారు ఇరిగేషన్ అధికారులు. ఆ తర్వాత ఢిల్లీ వెళ్లి కేంద్ర జలసంఘంతో సమావేశం కానున్నారు ఏపీ అధికారులు.. కాగా, ఈ మధ్య ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య బనకచర్ల ప్రాజెక్టు తీవ్ర వివాదంగా మారింది.. ఎలాగైనా బనకచర్లను అడ్డుకుంటామంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించగా.. మిగులు జలాలనేకదా? మేం వాడుకునేది.. అభ్యంతరాలు ఎందుకంటూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రశ్నించింది.. అయితే, దీనిపై కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదులు కూడా చేశారు తెలంగాణ సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి.. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిక కేంద్ర సర్కార్ షాక్ ఇచ్చింది.. బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలను వెనక్కి పంపింది కేంద్రం.. పర్యావరణ అనుమతులు తిరస్కరించింది.. పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే సీడబ్ల్యూసీ పరిశీలించాల్సి ఉందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.. గోదావరి నది జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్ అవార్డ్ లు దీని పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది.. ఈ ప్రాజెక్టుపై అనేక విధాలుగా ఫిర్యాదులు వచ్చయన్న కమిటీ.. గోదావరి నది జాలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించినట్లు అవుతుందని ఫిర్యాదులు వచ్చాయని పేర్కొంది..

## ఢిల్లీలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక సమావేశాలు..
## బీజేపీ కొత్త చీఫ్‌పై చర్చ జరిగే ఛాన్స్



**న్యూఢిల్లీ,:** దేశ రాజధాని ఢిల్లీలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక సమావేశాలు జరగనున్నాయి. కేశవ్ కుంజ్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ నేతృత్వంలో మంతన్ బైటక్ జరగనుంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్దోత్సవాల ప్రణాళికలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే సామాజిక సమరసతపై 'పంచ్ పరివర్తన్' దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాలపై కూడా మార్గదర్శకాలు చేయనున్నారు. ఇక ముంబై, బెంగుళూరు, కోల్‌కతా తదితర నగరాల్లో ప్రత్యేక సమావేశాలకు సన్నాహాలు చేస్తున్నారు. వీటిన్నంటితో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికపై కూడా ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో చర్చించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా పదవి కాలం ముగిసింది. కొత్త అధ్యక్ష పదవి ఈసారి మహిళకు ఇవ్వాలని ఆర్‌ఎస్‌ఎస్ సూచించింది. ఈ దిశగా బీజేపీ హైకమాండ్ కూడా అడుగులు వేస్తోంది. అయితే ఈ రేసులో ప్రధానంగా నిర్మలా సీతారామన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈమెకు దేశ వ్యాప్తంగా మంచి పలుకుబడి ఉంది. అంతేకాకుండా నాయకులందరితో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. అలాగే భాషలపై మంచి పట్టు ఉంది. ఇక రక్షణ మంత్రిగా, ఆర్థిక మంత్రిగా దేశానికి సేవలందించారు. అంతేకాకుండా త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ప్రాంత వాసిగా ఈ అంశం పార్టీకి కలిసి వస్తుందని భావిస్తోంది. అంతేకాకుండా దక్షిణాదిలో కూడా పార్టీ బలపడాలంటే.. సౌతిండియా మహిళకే ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని ఆలోచిస్తోంది. ఇక వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మోడీ సర్కార్.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ అధ్యక్ష పదవి మహిళలకే ఇస్తేనే బాగుంటుందని.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మేథోమథనం చేస్తున్నాయి. ఒక నిర్మలా సీతారామన్ కాకపోతే మాత్రం రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి అవకాశం దక్కే ఛాన్సుంది.ు

## ఇదేందయ్యా ఇదీ.. మొన్న 90 డిగ్రీల బ్రిడ్జి..
## నేడు పాము మెలికల వంతెన



భోపాల్: మధ్యప్రదేశ్‌లో వంతెనల నిర్మాణంపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. మొన్నటికి మొన్న భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన చర్చనీయాంశం కాగా.. తాజాగా మరో వంతెన తెరపైకి వచ్చింది. భోపాల్‌లోనే పాములా మెలికలు తిరిగిన రైల్వే ఓవర్ బ్రిడ్జి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. సదరు వంతెనపై ప్రయాణాల కారణంగా ఎనిమిది గంటల సమయంలోనే రెండు ప్రమాదాలు జరగడంతో.. వంతెన నిర్మించిన ఇంజినీర్, బీజేపీ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు వాహనదారులు. వివరాల ప్రకారం.. భోపాల్‌లోని సుభాష్‌నగర్‌లో రూ.40 కోట్లతో ఒక వంతెన నిర్మించారు. ఈ వంతెనను పాములా మెలికలు తిరిగినట్టు నిర్మించడం గమనార్హం. భోపాల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. అయితే, ఈ వంతెన వల్ల సుభాష్ నగర్ ప్రాంతంలో రద్దీ తగ్గినప్పటికీ దాని నిర్మాణం పలుచోట్ల మెలికలు తిరిగి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనపైకి ఎక్కిన కొన్ని సెకన్లలోనే పలుమార్లు మలుపులు తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. దీనివల్ల రాత్రి సమయాల్లో, అధిక వేగంతో ప్రయాణించే వాహనదారులు మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి.. ప్రమాదాల బారినపడుతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో పల్టీలు కొట్టింది. మరోసారి ఓ స్కూల్ వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టడంతో అందులోని విద్యార్థులకు గాయాలయ్యాయన్నారు. దీంతో, వంతెన నిర్మాణం చర్చనీయాంశంగా మారింది. మరిన్ని ప్రమాదాలు జరగకుండా వెంటనే తగిన చర్యలు తీసుకొని.. మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరారు. వంతెనలు ఇలా నిర్మించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మధ్యప్రదేశ్‌లో ఇటీవల నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. రాజధాని భోపాల్‌లో ఐష్‌బాగ్ వద్ద రూ.18 కోట్లతో ఇటీవల కొత్తగా ఓ రైల్వే వంతెన నిర్మించారు. అయితే, అది 90 డిగ్రీల మలుపు కలిగి ఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. నిర్మాణ సంస్థ మాత్రం ఆ డిజైన్‌ను సమర్థించుకుంది. సమీపంలో మెట్రో రైల్ స్టేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్పితే మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది. ఇలాంటి డిజైన్‌లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తాజాగా ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు విధించింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌పై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది.

## సిగాచీ పరిశ్రమలో ఆరో రోజు కొనసాగుతున్న శిథిలాల తొలగింపు



పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో శిథిలాల తొలగింపు ఆరో రోజు కొనసాగుతోంది. ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా సిబ్బంది భవన శిథిలాలు తొలగిస్తున్నారు. భారీ పేలుడులో ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 39కి చేరింది. ఇంకా 9మంది కార్మికుల ఆచూకీ తెలియాల్సి ఉంది. మరణించిన 39 మందిలో 34 మంది మృతదేహాలను మాత్రమే గుర్తించారు. గుర్తు తెలియని 5 మృతదేహాలు పటాన్‌చెరు ఆసుపత్రిలో ఉన్నాయి. వివిధ ఆసుపత్రుల్లో 23 మంది కార్మికులు చికిత్స పొందుతున్నారు. మరోవైపు రెస్క్యూ ఆపరేషన్‌పై వస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలు బాధితులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రక్రియ ముగిసిందని పోలీస్‌శాఖ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించగా.. రెవెన్యూ అధికారులు మాత్రం ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొనడం గమనార్హం.

# ఈసీకి జ్ఞానోదయం కలగాలి!




ఏ ఫిర్యాదు వచ్చినా, ఎలాంటి సమస్య ముంచుకొచ్చినా తక్షణం స్పందించాల్సిన బాధ్యతల్లో ఉన్నవారు మౌనంగా ఉండిపోతే అనుమానాలు బలపడతాయి. అలాంటివారి తటస్థత ప్రశ్నార్థకమవుతుంది. నిరుడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లొసుగులపై అప్పట్లోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులు చేసింది. కానీ ఎన్నికల సంఘం(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయింది. ఏడాదికాలం గడిచాక ఎట్టకేలకు గురువారం ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఆ ఫిర్యాదులపై వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుల వివరణల్ని విన్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికల నిర్వహణ లోపరహితంగా ఉండాలి. అనుమానాలకు తావీయకూడదు. కానీ ఏపీలో ఆద్యంతమూ అందుకు విరుద్ధంగా నడిచింది. నోటిఫికేషన్ విడుదల చేసిన మొదట్లోనే కూటమి నాయకులు ఫిర్యాదు ఇవ్వటం తడవుగా జిల్లాల్లో ఉన్నతాధికారుల్ని మార్చారు. అయిదేళ్లుగా అమలవుతున్న పథకాలను సైతం ఆపేయాలని ఆదేశించారు. నిర్ణయం తీసుకునేముందు కనీసం కూటమి నేతల ఆరోపణలకు ఆధారాలున్నాయో లేదో చూసుకోవాలన్న స్పృహ కూడా లేకపోయింది. ఫలితంగా అలాంటి జిల్లాల్లో పోలింగ్ రోజున ఎన్ని అవకతవకలు చోటుచేసుకున్నాయో మీడియా సాక్షిగా బయటపడింది. చాలా గ్రామాల్లో బడుగు వర్గాల్ని ఓటేయకుండా భయభ్రాంతులకు గురిచేశారు. వారి దౌర్జన్యాలకు అనేకమంది తలలు పగిలాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొంపా గోడూ వదిలి చెట్లల్లో పుట్టల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. అటు తర్వాత ఇక ఎదురులేదనుకుని ఈవీఎంలను దొంగవోట్లతో నింపేశారు. వీటిపై ఏ క్షణానికాక్షణం ఫిర్యాదులు వెల్లువెత్తినా దిక్కులేకుండా పోయింది. పోలైన నాలుగు కోట్లకుపైగా ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 6 తర్వాతే పడ్డాయి. ఇదంతా మాయాజాలం అనిపించదా? ఎన్నికలు ముంగిట్లోకొచ్చాక ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై వదంతులు వ్యాపింపజేసినా ఈసీలో వెంటనే కదలిక లేదు. అటు తర్వాత చంద్రబాబు, లోకేష్‌లపై కేసుపెట్టాలని ఆదేశించారు సరే... దాని అతీగతీ ఏమిటో ఎవరికీ తెలియదు. వేరే రాష్ట్రాల్లో విపక్షాలు ప్రధాని నరేంద్ర మోదీని ఏమైనా అంటే నొచ్చుకుని వెనువెంటనే చర్యలకు ఉపక్రమించిన ఈసీ... అప్పటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాళ్లతో కొట్టాలని బాబు నోరు పారేసుకున్నా చోద్యం చూసింది. ఇవన్నీ ఒక ఎత్తయితే లెక్కింపు నాడు వెల్లడైన వైపరీత్యాలకు అంతూ దరీ లేదు. పోలైన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ మధ్య భారీ వ్యత్యాసాలున్నాయి. నిరుడు మే నెల 13న రాత్రి 8 గంటలకు ఏపీ పోలింగ్ శాతం 68.12 అని ఈసీ ప్రకటించింది. రాత్రి 11.45కి దీన్ని సవరించి 76.50 శాతమన్నారు. మరో నాలుగు రోజులకల్లా అది 80.66 శాతం అని మాట మార్చారు. మొదట, చివరి ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడా ఉంది. గతంలోనూ మారిన సందర్భాలు లేకపోలేదు. కానీ ఈ తేడా ఒక శాతంకన్నా ఎప్పుడూ ఎక్కువ లేదు. పర్యవసానంగా సగటున ఒక్కో శాసనసభ స్థానంలో 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానం పరిధిలో 1.96 లక్షల ఓట్లు పెరిగాయి. ఇది 87 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటముల్ని నిర్దేశించింది. అంతేనా... పోలింగ్ ముగిసిన రోజున ఈవీఎంలలో ఉన్న చార్జింగ్ శాతం కౌంటింగ్ రోజుకు అమాంతం పెరిగింది. పదో, పదిహేను శాతమో చార్జింగ్ ఉన్నట్టు కనబడింది కాస్తా 98 శాతానికి ఎగబాకింది. రీచార్జబుల్ బ్యాటరీలు కనుక అలాంటిది జరగదని చెప్పటం తప్ప ఈసీ దగ్గర సంతృప్తికరమైన జవాబు లేకపోవటం దిగ్భ్రాంతికరం. బాహాటంగా బయటపడిన ఇలాంటి అవకతవకల పర్యవసానంగానే ఈవీఎంలలోని ఓట్లూ, వీవీ ప్యాట్ స్లిప్‌ల సంఖ్యనూ లెక్కేసి, అవి ఒకదానితో ఒకటి సరిపోయాయో లేదా తేల్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీ ఫుటేజ్‌లు ఇవ్వాలని కూడా కోరింది. ఇవేమీ గొంతెమ్మ కోరికలు కాదు. నదురూ బెదురూ లేకుండా కూటమి నేతలు తిమ్మిని బమ్మి చేసిన పర్యవసానంగానే వైఎస్సార్ కాంగ్రెస్ ఈ డిమాండ్లు చేసింది. తమ నిర్వాకం కళ్లముందు కనబడుతున్నప్పుడు మొండిగా అవేమీ ఇచ్చే ప్రసక్తి లేదని చెప్పటం ప్రజాస్వామికమేనా? అసలు సీసీ టీవీ ఫుటేజ్‌లూ, వీవీ ప్యాట్‌లూ ఎందుకొచ్చాయో, ఏ ప్రయోజనాన్ని ఆశించి ఎన్నికల ప్రక్రియలో వాటిని చేర్చాల్సివచ్చిందో సీఈసీకి, మరో ఇద్దరు కమిషనర్లకూ తెలుసా? ఎన్నికల్లో పాల్గొన్న పార్టీలు అనుమానాలు వ్యక్తం చేసినప్పుడు వాటిని నివృత్తి చేయటం వారి బాధ్యత కాదా? కనీసం హేతుబద్ధమైన జవాబైనా ఇచ్చే ప్రయత్నం చేయొద్దా? ఈసీ తీరు దేవతా వస్త్రాల కథను తలపిస్తోంది. కోట్లాది రూపాయలు వ్యయం చేసి సీసీ కెమెరాలూ, వీవీ ప్యాట్‌లు సమకూర్చుకోవటం, వాటిని ఉపయోగంలోకి తీసుకురావటం-తీరా రాజకీయ పార్టీలు సందేహం వెలిబుచ్చినప్పుడు వెల్లడించటం కుదరదని మొండికేయటం, నిబంధనలు ఒప్పుకోవనటం ఏం నీతి? పారదర్శకత లేని ఎన్నికలు జరపటం ఎవర్ని ఉద్ధరించటానికి? ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలకూ శిరోధార్యం రాజ్యాంగం. అది నిర్దేశించిన ప్రకారం నడుచుకోవాలి తప్ప ఇతరేతర ప్రభావాలకు లోను కాకూడదు. మళ్లీ బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలకు వెళ్లాలన్న డిమాండ్ సర్వత్రా వినిపించటానికి తమ నిర్వాకం కూడా కారణమని ఈసీ తెలుసుకోవాలి. ఈసీ తటస్థతపై తలెత్తుతున్న సందేహాల కారణంగానే ఇప్పుడు బిహార్‌లో ప్రారంభించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితాల నవీకరణకు చేస్తున్న ప్రయత్నాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా ఈసీ వైఖరి మారాలి. పారదర్శకంగా వుండే ప్రయత్నం చేయాలి.

# అరపైసే..అయినా..?




కొద్దిరోజులుగా రైల్వేఛార్జీలను పెంచుతారని వస్తున్న ఊహాజనిత వార్తల్ని కేంద్రం నిజం చేసింది. ఆర్డినరీ, సెకండ్ క్లాస్, స్లీపర్, ఫస్ట్ క్లాస్‌తో పాటు అన్ని ఏసీ బోగీల టికెట్ ధరల్ని పెంచింది. ఈ ఛార్జీలను జూన్ 30 అర్ధరాత్రి నుంచే రైల్వేశాఖ అమల్లోకి తీసుకొచ్చింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌కార్డు తప్పనిసరిచేస్తూ జోన్‌ల మేనేజర్లందరికీ సర్క్యులర్ జారీచేసింది. కిలోమీటర్‌కు అరపైసా చొప్పున పెంచినా అది రూపాయల్లో లెక్కిస్తే ప్రయాణాన్ని బట్టి ఒక్కొక్కరికి సగటున రూ.5 నుంచి 15 వరకు జేబుకు అదనంగా చిల్లుపడుతున్నది. కేంద్రం మాత్రం ఛార్జీల పెంపును సమర్థించుకుంది. పెంచింది స్వల్పమేనని, ఇది ప్రయాణికులకు ఏమాత్రం భారం కాదని పేర్కొంది. కానీ పెంపు ప్రభావం ప్రయాణికులపై తీవ్రంగానే పడనుంది. 2013, 2020లలో ఛార్జీల సవరణ పేరుతో పెంపుదల చేసిన సర్కార్, నిర్వహణ, వ్యయాల సాకును చూపెట్టి ఈ ఏడాది ప్రయాణికులపై మరోసారి భారాన్ని మోపింది. దూర ప్రాంత ప్రయాణాలు చేసే ప్రజలకు రైలు అత్యంత సౌకర్యమైనది. సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలోనూ పేరెన్నికగలది. అందుకే దీన్ని పేదోళ్ల గరీబ్‌రథ్‌గా పిలుస్తారు. అలాంటి రైలు ప్రయాణం రోజురోజుకూ గగనమవ్వడం ప్రయాణికులను ఒకింతా ఆందోళనకు గురిచేస్తున్నది. సాధారణంగా బస్సుఛార్జీలు పెంచే ముందు పాలకులు చెప్పే మాటల్ని గుర్తుచేసుకుంటే గనుక పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని ఆర్టీసీ మీద పడకుండా ఉండేందుకు టిక్కెట్ల ధరలు పెంచుతున్నామని చిలక పలుకులు పలుకుతారు. లేదంటే సంస్థ తీవ్రంగా నష్టాల్లో ఉందని, ఉద్యోగులకు జీతాలివ్వడమే కష్టమవుతున్నదని చెబుతుంటారు. కానీ ఇక్కడ రైల్వేను చూస్తే ప్రయాణికులతో నిత్యం కిటకిటలాడుతుంది. పండగ వేళల్లో ఈ రద్దీ రెట్టింపవుతుంది. భారతీయ రైల్వేచరిత్రలో ఇప్పటివరకు ఈ రంగం నష్టాల్లో ఉందనే వార్త కూడా వినలేదు. అయినా ఛార్జీలను పెంచి దానికి కుంటిసాకులు వెతుకుతున్నది. ఆధునిక వసతులు, ట్రెయినింగ్ వెహికిల్స్, హైజీనిక్ ఫెసిలిటీల కోసమేనంటూ చెబు తున్నది. ఇది ఏ రకంగా చూసినా ప్రయాణికులను మోసగించడమే.వాస్తవానికి, ప్రజలెన్నుకున్న పాలకులే ప్రభుత్వ రంగాలకు బడ్జెట్ పెంచి అభివృద్ధి చేయాలి. కానీ, ప్రజలపై భారాల్ని మోపుతూ కాదు! ప్రస్తుత టికెట్ ధరల్ని చూస్తే సాధారణ, సెకండ్ క్లాస్ రైలు ప్రయాణం 500 కి.మీ.లోపు పాత ఛార్జీలే ఉంచి వ్యతిరేకత రాకుండా కేంద్రం జాగ్రత్త తీసుకున్నట్టు కనిపిస్తున్నది. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్‌క్లాస్ ఆర్డినరీ టికెట్ల ధరలు కి.మీ. అరపైసా చొప్పున, అలాగే నాన్ ఏసీ ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ టికెట్లపై కి.మీ. ఒక పైసా చొప్పున పెంచింది. వీటిల్లో ఎక్కువమంది పేదలు, మధ్య తరగతి ప్రజలు వెళ్తుంటారు. అందులో ఐదువందల కి.మీలోపు ప్రయాణించే వారు చాలా తక్కువ. ఎందుకంటే, ప్రత్యేకంగా కార్లు, విమానాల్లో తిరిగే ఆర్థిక స్తోమత వీరికుండదు. రైల్లోనే దూరప్రాంతాలకు వెళ్లొస్తుంటారు. ఇంకా చెప్పాలంటే నిలబడి, అది కుదరకపోతే వేలాడుతూ అయినా ఏదో విధంగా గమ్యానికి చేరుకునే వారు కోకొల్లలు. అలా ప్రమాదాల్లో చనిపోయినవారు కూడా అనేకం. ప్రభుత్వానికి ఛార్జీల పెంపుపై ఉన్న శ్రద్ధ, మౌలిక వసతుల కల్పన, ప్రయాణికుల భద్రతపై లేకపోవడం శోచనీయం. ఉన్న ఊళ్లో ఉపాధి లేక ముంబాయి, భీవండి, సూరత్, షోలాపూర్‌లాంటి ప్రాంతాల్లో వలస కార్మికులు పనులు చేస్తుంటారు. హైదరాబాద్ నుంచి సూరత్‌కు సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరానికి లెక్కేసినా 500 కిలోమీటర్ల అదనపు ప్రయాణానికి రూ.5, నెలకో లక్ష మంది ప్రయాణిస్తే రూ.5లక్షలు, ఏడాదికి 60లక్షలు. ఇది సామాన్యులకు భారమే కదా! ఇక్కడ చెప్పుకునేది ఒక రూటుకు మాత్రమే. అలాంటిది దేశంలో ప్రతిరోజు కొన్ని లక్షల మంది వేల కి.మీ. ప్రయాణిస్తారు. ఏసీ కోచ్ రైళ్లపైనా కి.మీ.కు 2 పైసలు చొప్పున పెంచారు. మోడీ గొప్పగా చెప్పుకునే వందేభారత్ కూడా ఇందులోకే వస్తుంది. తేజస్, రాజధాని, శతాబ్ది, దురంతో, హమ్ సఫర్, అమృత్‌భారత్, గతిమాన్, మహామన, జన శతాబ్ది, యువ ఎక్స్‌ప్రెస్, అంత్యోదయ, విస్టాడోమ్ కోచ్ వంటి అన్ని ప్రీమియం, స్పెషల్ సర్వీసులపైనా ఛార్జీలను వడ్డించారు. దేశంలో నేడు పేదలకు పూట గడవడమే కష్టంగా మారింది. ఎంతోకొంత చదువుకున్న కుటుంబాల్లో కూడా ఇద్దరు, ముగ్గురు పనిచేస్తే తప్ప ముద్దచేతికి రాని పరిస్థితి ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ పదకొండేండ్ల కాలంగా నిత్యావసరాలు, పెట్రోధరలు, విద్యా, వైద్య ఖర్చులు, ఈఎంఐలు, లోన్లు ఇలా సవాలక్ష సమస్యల మధ్య సామాన్యులు బతుకు లీడుస్తున్న దుస్థితి నెలకొంది. పైగా పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటివి ఐదేండ్లుగా ప్రజల్ని నిత్యం వెంటాడుతూనే ఉన్నవి. ఈ నేపథ్యంలోవీలైతే ప్రజలపైభారాల్ని తగ్గించాలి. కానీ, మరిన్ని రుద్దడం సబబు కాదు. పెంచిన ఛార్జీలపై విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణం లోకేంద్రంపున:పరిశీలించాలి,వెంటనేఉపసంహరించు కోవాలి.

# దలైలామా ఎంపిక.. భారత్‌కు పరీక్ష



టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక భారత్‌కు దౌత్యపరమైన పరీక్షగా తయారైంది. వారసుడి ఎంపికకు తమ ఆమోద ముద్ర తప్పనిసరి అంటూ చైనా చేసిన డిమాండ్‌ను భారత్ తోసిపుచ్చింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం ఇప్పటి దలైలామాదే తప్ప మరెవరికీ లేదని భారత్ స్పష్టం చేసింది. దలైలామా బుధవారం తన వారసుడి ఎంపికపై కీలక ప్రకటన చేస్తూ తన పునర్జన్మ (రీ ఇంకార్నేషన్)కు గుర్తింపు ఇచ్చే ఏకైక హక్కు తమ అధికారిక గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాను హెచ్చరిస్తూ స్పష్టం చేశారు. కొత్త దలైలామాను ఎంపిక చేయడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలను ఆయన వ్యతిరేకించారు. అయితే దలైలామా ప్రకటనకు వెంటనే చైనా స్పందించింది. దలైలామా వారసుడిని ఎంపిక చేయడానికి తమ సెంట్రల్ గవర్నమెంట్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో చైనా టిబెట్ మధ్య మరో కొత్త సంఘర్షణ మొదలవుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. దలైలామా పరంపరకు 600 ఏళ్ల చరిత్ర ఉంది. చైనా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోని వ్యవస్థ ఎంపిక కన్నా దలైలామాకే ఎంపిక అవకాశం కల్పించే నైతికతకు భారత్ మద్దతు ఇవ్వాల్సి ఉంది. భారత్ చైనా మధ్య టిబెట్ వివాదం సుమారు 70 ఏళ్లుగా నడుస్తోంది. 13వ శతాబ్ద కాలంనుంచి టిబెట్ తమ దేశంలో భాగంగానే ఉందని చైనా వాదిస్తోంది. 1950 అక్టోబరులో టిబెట్‌ను భారత్ ఆక్రమించుకోందని చైనా ఆరోపించడంతో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బ్రిటిష్ ప్రభుత్వం సలహాపై టిబెట్ అంశంపై దాదాపు చేతులెత్తేశారు. సైనిక సాయం లేకుండా టిబెట్‌కి ఎలాంటి ప్రయోజనం కలిగించాలన్నా నిర్ణయం తీసుకోవలసింది భారతేనని, టిబెట్ స్వతంత్రతకు గుర్తింపు అన్న ప్రసక్తే ఉండరాదని బ్రిటిష్ ప్రభుత్వం సూచించడంతో టిబెట్‌పై ఆధిపత్యాన్ని పరోక్షంగా చైనాకే నెహ్రూ విడిచిపెట్టారు. 1950లో సామ్యవాద ముసుగులో టిబెట్ విషయంలో చైనాను భారత్ వెనకేసుకు వచ్చిందన్న వాదనలు కూడా ఉన్నాయి. అప్పటి నుంచి టిబెట్‌పై సర్వాధికారం తమదేనని చైనా విర్రవీగుతోంది. 13వ దలైలామా 1912లో టిబెట్‌ను స్వతంత్ర ప్రాంతంగా ప్రకటించినా, 40 ఏళ్ల తరువాత చైనా టిబెట్‌పై దాడి చేసింది. 14 వ దలైలామా ఎంపిక ప్రక్రియ ప్రారంభమైన సమయంలో ఈ దాడి జరిగింది. ఆ యుద్ధంలో టిబెట్ ఓడిపోయింది. 1951 లోనే తమ నియంత్రణలోకి టిబెట్‌ను చైనా తెచ్చుకుంది. 1954లో చైనాతో భారత్‌కు కుదిరిన ఒప్పందంలో టిబెట్‌ను చైనాలోని ప్రాంతంగా గుర్తిస్తూ అంగీకరించింది. చైనా వేధింపులు తట్టుకోలేక 1959లో టిబెట్ నుంచి భారత్‌కు దలైలామా శరణార్థిగా వచ్చారు. ఆయనకు ఆశ్రయం కల్పించడంలో అప్పటి ప్రధాని నెహ్రూ ఎంతో సాయపడ్డారు. వేలాది మంది అనుచరులైన టిబెటన్లతో కలిసి హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. దలైలామాపై చైనా వేర్పాటువాది, తిరుగుబాటుదారుడు అనే ముద్రవేసింది. భారత్ చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండడంతో భారతదేశ టిబెట్ విధానంలో మార్పు వచ్చింది. భారత ప్రభుత్వంతో కలిసి దలైలామా చురుకుగా వ్యవహరించడం చైనాకు నచ్చడం లేదు. చైనా గత కొన్నేళ్లుగా తదుపరి దలైలామా ఎంపిక తమదేనని వాదిస్తోంది. టిబెట్‌ను పూర్తి స్వయం ప్రాతిపదిక ప్రావిన్స్‌గా 'జిజాంగ్' పేరుతో వ్యవహరిస్తోంది. బౌద్ధమత మఠాలను తన అధీనంలో ఉంచుకుంది. బౌద్ధ భిక్షువులైన లామాలపై తమ పెత్తనం సాగించడానికి కఠినమైన నిబంధనలను విధిస్తోంది. 'జిజాంగ్‌లో మానవ హక్కుల కొత్త యుగం' పేరుతో శ్వేతపత్రాన్ని ప్రకటించి టిబెట్‌లోని చట్టపరమైన, మతపరమైన వ్యవహారాలకు రక్షణగామార్గదర్శకాలను సూచించింది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం దలైలామా ఎంపికకు మద్దతు ఇచ్చే విషయంలో ఆచితూచి వ్యవహరించవలసి ఉంటుంది. తాము నియమించే దలైలామాకే చట్టపరమైన అధికారం ఉంటుందని చైనా వాదిస్తోంది. చైనాకు చెందిన పిఎల్‌ఎ వెస్టర్న్ థియేటర్ కమాండ్‌కు టిబెట్ రీజియన్‌లో గట్టి పట్టు ఉంది. ఇప్పుడు చైనాకు వ్యతిరేకంగా దలైలామా ఎంపిక జరిగితే తీవ్ర సంఘర్షణలకు దారి తీయవచ్చు. తమ చెప్పుచేతల్లో నడిచే దలైలామా ఉండాలని చైనా ఆరాటపడుతోంది. అయితే దలైలామా వ్యవస్థను రద్దు చేసే మార్గంలో చైనా వెళ్లే అవకాశం లేదు. అందువల్ల ప్రస్తుతం ఉన్న బౌద్ధుల్లో దలైలామాను ఎంపిక చేయడానికి 2016 లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వ్యవస్థను అనుసరించవచ్చు. దానికి అనేక మంది అర్హులమని పోటీపడితే బంగారు కలశంలో లాటరీ ద్వారా ఎంపిక చేయవచ్చు. చైనాలో పూర్వం టిబెట్ లామాలను ఎంపిక చేయడానికి బంగారు కలశం లాటరీ పద్ధతి అనుసరించేవారు. చైనాలో 1793లో ఈ పద్ధతి ఉండేది. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను అనుసరించే దలైలామాను రాజకీయ ప్రాధాన్యంలో గుర్తించవచ్చు. ఇంకా ప్రస్తుత దలైలామా ట్రస్ట్ గాడెన్ ఫోడాంగ్ ఎంపిక చేసిన దలైలామాతో సన్నిహితంగా మసలే మరో దలైలామాను చైనా ఎంపిక చేసే అవకాశం కూడా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ నైతికపరంగా తమ దౌత్యవిధానానికి అనుగుణంగా రాజకీయ వ్యూహాత్మక మార్గం లో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దలైలామా ట్రస్ట్‌కే అధికారం కేంద్రీకృతమైన ప్రస్తుత సమయంలో ఈ ఎన్నిక చిత్రం నుండి దూరంగా భారత్ ఉంటుందని అనుకోవడం అవివేకమే అవుతుంది. టిబెట్ బౌద్ధ సమాజానికి దలైలామాను ఎంపిక చేసుకునే మత స్వేచ్ఛను తప్పనిసరిగా ప్రోత్సహించాల్సిన నైతిక బాధ్యత భారత్‌దే.

ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# అన్నీ ఆ 13,000 రూపాయల్లోనే! దిగువ మధ్యతరగతి సగటు ఆదాయం రూ.33 వేలు

వచ్చేదే అరకొర. పొదుపుగా వాడుకోవాలి. అందులోనే దాచుకోవాలి. అనుకోని ఖర్చులు ఎదురైతే ఎలా అని వెంటాడే ఆలోచనలు.. ఇదీ పైసా పైసా లెక్కబెట్టే ఓ సగటు దిగువ మధ్య తరగతి 'జీవి'తం. దేశంలో దిగువ మధ్య తరగతికి చెందిన వ్యక్తుల సగటు ఆదాయం నెలకు రూ. 33,000. ఖర్చులు రూ. 20,000 వరకు ఉంటున్నాయి. మిగిలిన రూ.13 వేలల్లోనే వారి కలలు, ఆకాంక్షలు, నిర్ణయాలు అన్నీ ముడిపడి ఉంటున్నాయని 'హోమ్ క్రెడిట్' సంస్థ నివేదిక చెబుతోంది. గతేడాదితో పోలిస్తే ఆయా విభాగాల్లో నెలవారీ సగటు వ్యయాలూ పెరిగాయని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1.8 కోట్ల మంది కస్టమర్లున్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ 'హోమ్ క్రెడిట్ ఇండియా' విడుదల చేసిన 'ద గ్రేట్ ఇండియన్ వాలెట్-2025' నివేదిక ప్రకారం నెలవారీ వ్యయాలు పోను తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తున్న వారు 50% మంది మాత్రమే. ఖర్చులతోనూ వెళ్లదీస్తూ, ఆదా చేయలేకపోతున్నవారు 38% మంది ఉన్నారు. 12% మంది నెలవారీ అవసరాల కోసం అప్పు చేస్తున్నారు. ప్రాంతాలు, తరాల వారీగా ఆదాయాల్లో వ్యత్యాసం, కొనుగోళ్ల తీరు వేరుగా ఉందని ఈ నివేదిక తెలిపింది.

**ఆదాయం రూ.5 లక్షలలోపు..**

వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న కుటుంబాల ఆదాయాలు, ఖర్చులు, పొదుపుల ఆధారంగా 17 నగరాలలోని 18-55 ఏళ్ల వయసున్న వ్యక్తుల నుంచి సేకరించిన సమాచారంతో ఈ నివేదిక రూపొందించారు. వీరిలో పురుషులు 84%, స్త్రీలు 16% ఉన్నారు. జెన్ -జడ్ (13-28 ఏళ్లు) 19%, మిలీనియల్స్ (29-44 ఏళ్లు) 53, జెన్ -ఎక్స్ (44-59 ఏళ్లు) 28% ఉన్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో కార్మికులు 42 %, వ్యాపారులు 29, వేతన జీవులు 22, స్వయం ఉపాధి పొందుతున్నవారు 7% ఉన్నారు.

**పొదుపులో జెన్ -జడ్**

జెన్ -జడ్ తరంలో అత్యధికంగా 56% మంది పొదుపు చేస్తుండడం ఆసక్తి కలిగిస్తోంది. మిలీనియల్స్‌లో ఇది 53%. వీరితో పోలిస్తే జెన్ -ఎక్స్‌లో తక్కువగా 41% మంది మాత్రమే సేవింగ్స్‌కు మొగ్గు చూపుతున్నారు. వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచన ఉన్నవారిలో జెన్ -జడ్ తరం నుంచి 33% ఉన్నారు. లక్ష్యాలను చేరుకోవడానికి ఆర్థిక మార్గదర్శకులు కావాలని 58% మంది భావిస్తున్నారు. జెన్ -జడ్ విషయంలో ఈ సంఖ్య 65%, మిలీనియల్స్‌లో 59% ఉన్నారు. ఇక భారత్‌లో దక్షిణాది రాష్ట్రాలు అత్యధిక సగటు ఆదాయం రూ.38,600 నమోదు చేయగా, ఉత్తరాది, తూర్పున ఇది సగటున రూ.30,300గా ఉంది. బెంగళూరు రూ.45,700తో తొలి స్థానంలో నిలిచింది. రూ.39,200తో హైదరాబాద్, రూ.35,800 తో ముంబై ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**ఆకాంక్షలతోపాటు ఆందోళనలు..**

వచ్చే అయిదేళ్లలో వ్యాపారం ప్రారంభించడం, విస్తరించాలని 23% మంది లక్ష్యంగా చేసుకున్నారు. ఇల్లు కొనుక్కోవాలని 23% ఆకాంక్షించారు. పిల్లల విద్యకు పొదుపు చేయాలని 15% మంది, రుణాల చెల్లింపు 11%, కారు కొనుగోలు 11%, విదేశీ టూర్ వెళ్లాలని 7% మంది భావిస్తున్నారు. దాదాపు 60% మంది తమ ఆర్థిక భవిష్యత్తు గురించి ఆందోళనగా ఉన్నారు. పిల్లల చదువులకు ఖర్చులు సరిపోవడం లేదని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే తగినంత పొదుపు లేదని, రుణాలు తిరిగి చెల్లించలేకపోతున్నామని, ఉద్యోగం లేదా ఆదాయ వనరు కోల్పోయామని, పదవీ విరమణకు సరిపడా డబ్బు లేవని ఆవేదన చెందుతున్నారు.

**దుకాణాలకు వెళ్లి..**

దుస్తులు, ఫ్యాషన్ , మొబైల్ ఫోన్ ్స, గృహోపకరణాలు, సరుకులు, మందులు.. ఈ విభాగాల్లో కస్టమర్లు ప్రత్యక్షంగా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. మొత్తం కొనుగోళ్లలో ఏకంగా 83-85% ఆఫ్‌లైన్ లోనే నమోదు కావడం గమనార్హం. బస్సు, రైలు టికెట్ బుకింగ్స్, ఫుడ్ ఆర్డర్స్‌లో ఆఫ్‌లైన్ వాటా 58-59%గా ఉంది. రుణాల చెల్లింపుల్లో 50%, బిల్ పేమెంట్స్‌లో 54% ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు.

**రూ.20వేల వరకు ఖర్చులకే సరిపోతోంది**
**పొదుపు చేయగలుగుతున్న వారు 50% మంది**
**భారీగా పెరిగిన పిల్లల చదువు వ్యయం**
**గతేడాదితో పోలిస్తే 34% పెరుగుదల**
**దుకాణాలకు వెళ్లి కొంటున్నారు**
**'ద గ్రేట్ ఇండియన్ వాలెట్-2025' నివేదిక**
**కొనుగోళ్లలో సుమారు 85% ఆఫ్‌లైన్ లోనే**

# పేదరికంపై యుద్ధం చేయాలి... చరిత్ర సృష్టించాలి

సరైన సమయంలో సాయం... నిరంతర మార్గనిర్దేశనం

ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడానికి పీ4 అద్భుతమైన వేదిక

బంగారు కుటుంబాలకు సంక్షేమంలో కోత ఉండదు

పీ4 అమల్లో బాపట్ల జిల్లా టాప్

పీ4 అమలుకు వివిధ స్థాయిల్లో రెండు కమిటీలు, రెండు ఛాప్టర్ల ఏర్పాటు

పీ4 లోగోను ఖరారు చేసిన ముఖ్యమంత్రి

సీఎం నేతృత్వంలో స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం



అమరావతి, : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న పీ4 విధానంపై కీలక అడుగులు పడ్డాయి. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగింది. రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ జనరల్ బాడీ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. పీ-4 పథకం సమర్థవంతంగా అమలుకు రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడ్వైజరీ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే జిల్లా, నియోజకవర్గం స్థాయిలో పీ4 ఛాప్టర్లు ఏర్పాటుకు జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆయా కమిటీల్లో స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సహా ఇన్చార్జ్ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. పీ4 స్ఫూర్తిని చాటేలా రూపొందించిన లోగోను ముఖ్యమంత్రి ఖరారు చేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

**పీ4 స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లండి**

"పేదల బతుకుల్లో వెలుగును నింపేలా పీ4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. పీ4 స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేలా పీ4 విధానం అమలు చేస్తున్నాం. గతంలో జన్మభూమి అని పిలుపు ఇస్తే మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు పీ4 అంటున్నాం.. మంచి స్పందన వస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలి. ఇక పీ4 బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చే మార్గదర్శులు పాత్రపై మరింత క్లారిటీకి రావాలి. బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా.. వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా మార్గదర్శులు గైడ్ చేస్తూ ఉండాలి. అవసరమైన సమయంలో సాయంతోపాటు.. నిరంతర మార్గనిర్దేశనం చేసేలా మార్గదర్శులు ఉండాలి. కొందరు మార్గదర్శులు.. ఒక్కసారి ఆర్థిక సాయం చేస్తే సరిపోతుందేమోనని భావిస్తున్నారు. ఇలాంటి వారి సాయాన్ని పీ4 వేదికగా పేదలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమే. కానీ దత్తత తీసుకున్న పేద కుటుంబాలకు నిరంతరం గైడెన్స్ ఇచ్చే మార్గదర్శులను గుర్తించండి. వివిధ నియోజకవర్గాల పరిధిలో ఉండే ఎన్ఆర్ఐలు.. వివిధ పరిశ్రమలు.. ధనవంతులు ఎవరో గమనించాలి. వివిధ రూపాల్లో పేదలకు సేవలు అందించే వారిని గుర్తించండి. ఇలాంటి వారిని పీ4 వేదిక మీదకు తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**సంకల్పం తీసుకుందాం... పేదరికం లేని సమాజం స్థాపిద్దాం..**

"పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా పని చేయాలి. పీ4 విధానం ద్వారా రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపుమాపాలి. ఇలా చేయాలంటే మామూలు విషయం కాదు. పేదరికంపై యుద్ధం చేయాలి.. అప్పుడే చరిత్ర సృష్టించగలం. దీనికి సంకల్పం తీసుకోవాలి. సంకల్పం తీసుకుంటే ఎంతటి అసాధ్యాన్నైనా సుసాధ్యం చేయవచ్చు. మారుతున్న పరిణామాలను గమనించాలి. ఒకప్పుడు పీపీపీ మోడల్ అన్నాం. ఇప్పుడు వీజీఎఫ్ అనే కొత్త విధానం వచ్చింది. వీటిని అందిపుచ్చుకుంటే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. అదే విధంగా గతంలో జన్మభూమి ద్వారా సమాజానికి సేవ చేయాలనే విధానాన్ని అందిపుచ్చుకున్నాం. గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద ఎత్తున ఆస్తులను సృష్టించుకున్నాం. ఇప్పుడు పీ4 విధానం ద్వారా పేదలకు సాయం చేస్తూ.. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన టాప్ 10 శాతం మంది.. అట్టడుగున పేదరికంలో ఉన్న 20 శాతం మందితో అనుసంధానం చేసే విధానమిది. సమాజంలోని వనరులను ఉపయోగించి పైకి ఎదిగిన వారు.. ఇప్పుడు గివ్ బ్యాక్ పాలసీపై ఫోకస్ పెడుతున్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్, వేదాంత, జీఎమ్మార్ వంటి సంస్థలే దీనికి ఉదాహరణ." అని చంద్రబాబు వివరించారు.

**సంక్షేమానికి అదనంగా పీ4**

"బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదు. ఈ విషయాన్ని గతంలోనే చెప్పాను. ఇప్పుడూ మళ్లీ చెబుతున్నాను. సంక్షేమ పథకాలకు.. పీ4కు లింకు ఉండదని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పండి. సంక్షేమాన్ని కొనసాగిస్తూనే.. బంగారు కుటుంబాలకు ఆర్థిక చేయూత అందుతుంది. సంక్షేమం అందిస్తే పేదరికం పోదు. ఇలా అయితే.. 75 ఏళ్లుగా ఎంతో ఖర్చు పెడుతున్నాం.. కానీ పేదరికం తొలగిపోవడం లేదు.. పేదల ఆర్థిక ఎదుగుదలకు సరైన సమయంలో సరైన గైడెన్స్ అవసరం.. చాలా మంది చిన్న కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే.. వారి వారి రంగాల్లో రాణించారు. పేదలకు ఓ గైడింగ్ ఫోర్స్ ఉండేందుకే పీ4 విధానాన్ని అమలు చేస్తున్నాం. బంగారు కుటుంబాల్లోని యువత, విద్యార్థుల కెరీర్ ను సెటిల్ చేసేలా మార్గదర్శులు చూడాలి. ఎన్నో ఆలోచనలు ఉన్నా.. పేదరికం కారణంగా చాలా మంది ఏం చేయలేకపోతున్నారు. బంగారు కుటుంబాల్లోని వ్యక్తుల ఆశలు.. ఆశయాలకు ఆలంబనగా మార్గదర్శులు నిలవాలి. ప్రభుత్వం ఇచ్చే దానికి అదనంగా మార్గదర్శకులు సహకరించాలి. ప్రజలే ఆస్తిగా పరిగణించాలి. మార్గదర్శుల ఎంపిక కోసం.. పేదలకు సాయం చేయాలని కోరుతూ నేను చాలా మందితో మాట్లాడాను. చాలా మంది మోటివేట్ అవుతున్నారు. పేదలకు సాయం చేసేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారు." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ప్రజల్లోకి వెళ్లడానికి... మంచి పేరు తెచ్చుకోవడానికి వేదిక పీ4**

"మంచి పేరు తెచ్చుకుంటే కిక్ వస్తుంది. మంచి పేరు కోసం పేదలకు సేవ చేసే వారు ఉన్నారు.. ఆర్థికంగా సాయం చేసే వారున్నారు. వీళ్లని గుర్తించాలి. అలాగే ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడానికి ప్రజా ప్రతినిధులకూ పీ4 అద్భుతమైన వేదిక. ప్రతి నియోజకవర్గంలోనూ 6-10 వేల పేద కుటుంబాలు బంగారు కుటుంబాలుగా ఎంపిక కానున్నాయి. ఎమ్మెల్యేలకు ఇంతకు మించిన పెద్ద అవకాశం ఉండదు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. నమ్ముకున్న నియోజకవర్గానికి న్యాయం చేయడానికి ఈ స్కీంను వినియోగించుకోవచ్చు. పీ4 అమలు విషయంలో అందరి మధ్య పోటీ రావాలి. ఎమ్మెల్యేల మధ్య పోటీ.. అధికారుల మధ్య పోటీ ఉంటుంది. స్థానికంగా ఏయే నియోజకవర్గాల్లో పరిశ్రమలు ఉంటే.. వారు ఆయా నియోజకవర్గాల్లోని బంగారు కుటుంబాలను అడాప్ట్ చేసుకునే విధానాన్ని అమలు చేస్తాం. ఇక పరిశ్రమలు లేని నియోజకవర్గాలు.. ధనవంతులు పెద్దగా ఉండని ఏజెన్సీ ఏరియాల్లోని బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను అటాచ్ చేసే అంశంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. సమాజం కోసం అందర్నీ భాగస్వాములను చేయాలి. ఇక అధికారులు కూడా బంగారు కుటుంబాలు, మార్గదర్శుల వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలి. రియల్ టైమ్ నుంచి డేటాను తీసుకోవాలి. దీని కోసం ప్రత్యేకంగా డ్యాష్ బోర్డు ఉంటుంది." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**పీ4 లోగోకు ఆమోదం**

పీ4 స్ఫూర్తిని చాటేలా రూపొందించిన ఆరు రకాల లోగోలను అధికారులు సీఎం ముందు ఉంచారు. అందరి అభిప్రాయం తీసుకున్న అనంతరం పీ4 లోగోను సీఎం ఆమోదించారు. పీ4 లోగో కూడా ఫైనల్ చేశాం కాబట్టి.. దీన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీ4 విధానం పైనా.. దీని వల్ల కలిగే లాభాల పైనా.. పీ4 ద్వారా లబ్ది పొందిన వారి కేస్ స్టడీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే పేదలకు సేవలందించడానికి ముందుకు వచ్చిన మార్గదర్శులకు సముచిత రీతిలో గౌరవం ఇవ్వాలని సీఎం చెప్పారు. పీ4 అమల్లో బాపట్ల జిల్లా అగ్రభాగంలో ఉందని.. దీనికి కృషి చేసిన ఆ జిల్లా ప్రజా ప్రతినిధులకు, జిల్లా కలెక్టరుకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. పీ4 విధానం ద్వారా ముఖ్యమంత్రి అద్భుత కార్యక్రమాన్ని చేపడుతున్నారని.. దీనికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యేలు చెప్పారు. అలాగే పీ4 విధానం అమలు విషయంలో ఉన్న కొన్ని సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# బుర్ర షార్ప్ గా పనిచేయాలంటే ఈ ఆరు ఉండాల్సిందే!

మెదడు ఆరోగ్యాన్ని పెంచడంలో పోషకాహారం కీలక పాత్ర

జ్ఞాపకశక్తి, ఏకాగ్రతకు ఎంతో మేలు చేసే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు


నరాల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే విటమిన్లు బి-12, డి

ఆక్సీకరణ ఒత్తిడి నుంచి మెదడును కాపాడే విటమిన్ ఈ

ఆకుకూరలు, నట్స్‌తో మెదడుకు మేలు చేసే మెగ్నీషియం

పండ్లు, గ్రీన్ టీతో లభించే క్వెర్సెటిన్ ప్రయోజనాలు







శారీరకంగా ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యం. ముఖ్యంగా, మన మెదడు పనితీరు చురుగ్గా, ఆరోగ్యంగా ఉండాలంటే మంచి నిద్ర, వ్యాయామంతో పాటు మనం తీసుకునే ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. కొన్ని ప్రత్యేకమైన పోషకాలు మెదడు పనితీరును మెరుగుపరచడమే కాకుండా, వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు వంటి సమస్యల నుంచి కూడా కాపాడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మెదడు ఆరోగ్యాన్ని పెంచే అటువంటి 6 ముఖ్యమైన పోషకాలు, అవి లభించే సహజ వనరుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు: ఇవి మెదడు కణాల నిర్మాణానికి, వాటి పనితీరుకు చాలా అవసరం. ఒమేగా-3 జ్ఞాపకశక్తిని, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. సాల్మన్, సార్డైన్ వంటి చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్స్‌లో ఇది సమృద్ధిగా లభిస్తుంది.

2. విటమిన్ బి12: నరాల కణజాలాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో, ఎర్ర రక్త కణాల ఉత్పత్తిలో విటమిన్ బి-12 కీలక పాత్ర పోషిస్తుంది. గుడ్లు, పాలు, పెరుగు, జున్ను, మాంసం వంటి వాటిలో ఇది పుష్కలంగా ఉంటుంది.

3. విటమిన్ డి: 'సన్‌షైన్ విటమిన్'గా పిలువబడే విటమిన్ డి ఎముకలకే కాకుండా మెదడుకు కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది మెదడులో వాపును తగ్గించి పనితీరును మెరుగుపరుస్తుంది. సూర్యరశ్మి ద్వారా శరీరం దీన్ని సహజంగా తయారు చేసుకుంటుంది. ట్యూనా చేపలు, గుడ్డు సొన, పుట్టగొడుగుల ద్వారా కూడా పొందవచ్చు.

4. మెగ్నీషియం: ఈ ఖనిజం మెదడు సంకేతాలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి అవసరమైన కణాలను ఉత్తేజపరుస్తుంది. ఆకుకూరలు, బాదం, గుమ్మడి గింజలు, డార్క్ చాక్లెట్‌లో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. 5. విటమిన్ ఈ: ఇది ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఫ్రీ రాడికల్స్ వల్ల మెదడు కణాలకు కలిగే నష్టాన్ని (ఆక్సీకరణ ఒత్తిడి) నివారిస్తుంది. బాదం, పొద్దుతిరుగుడు విత్తనాలు, అవకాడో, బ్రోకోలీ వంటి వాటిలో విటమిన్ %జు% లభిస్తుంది. 6. క్వెర్సెటిన్: ఇది యాపిల్స్, బెర్రీ పండ్లు, ఉల్లిపాయలు, గ్రీన్ టీలలో లభించే ఒక ఫ్లేవనాయిడ్. ఇది మెదడు కణాలకు శక్తిని అందించడంలో సహాయపడి, అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పును తగ్గించగలదని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌కు ఆమోదం..
# ప్రభుత్వం ఉత్తర్వులు

**అమరావతి,:** అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. గత నెల 30వ తేదీన విజయవాడలో జరిగిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్ నిర్వహించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది ఏపీ ప్రభుత్వం. ఈ వర్క్‌షాప్ ద్వారా ప్రభుత్వ, పరిశ్రమ, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు కలిసి కొత్త టెక్నాలజీని సమన్వయంతో పనిచేసే దిశగా చర్చలు తీసుకోవాలని తెలిపింది ప్రభుత్వం. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో "అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్" ను జూన్ 30 ప్రకటించింది ప్రభుత్వం. ఈ డిక్లరేషన్‌పై ఇవాళ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. ఈ ఉత్తర్వుల ద్వారా క్వాంటం పరిశోధన, ఆవిష్కరణ, ప్రతిభ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనునట్టు తెలిపింది ప్రభుత్వం.. దేశంలోపే అతి పెద్ద క్వాంటమ్ వ్యాలీ బెడ్‌గా క్వా -చిప్- ఇన్ ను వచ్చే 12 నెలల్లో అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపిం ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కార్.. 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి లక్ష్యంగా పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చింది ప్రభుత్వం. 2026లో ప్రారంభం అయ్యే అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా శిక్షణ , ఫెలోషిప్ లు అందజేయాలని నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం..

### ఈసారి బీహార్ ప్రజలు ఎటువైపు అంటే..!
## తాజా రిపోర్టులు వచ్చేశాయ్!




**న్యూఢిల్లీ,:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడింది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇక అన్ని పార్టీలు కూడా ఎన్నికల చదరంగంలోకి దిగేశాయి. ఈసారి నువ్వానేనా? అన్నట్టుగా ప్రధాన పార్టీలన్నీ తలపడతున్నాయి. ఇక ముఖ్యమంత్రి పీఠమే లక్ష్యంగా తేజస్వి యాదవ్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇంకోవైపు అధికారం కోసం ప్రశాంత్ కిషోర్ కూడా ప్రయత్నిస్తున్నారు. ఇలా ఎవరికి వారే ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటున్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా యువత ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. 90 శాతం ఓట్లు యువతపైనే ఆధారపడి ఉన్నాయి. దీంతో యువతే లక్ష్యంగా ప్రధాన పార్టీలు హామీలు కుమ్మరిస్తున్నాయి. ఇక తాజాగా బీహార్ ఎన్నికలపై ఆయా సంస్థలు చేసిన సర్వేలు బయటకు వస్తున్నాయి. ఇంక్‌ఇన్‌సైట్ విడుదల చేసిన అభిప్రాయ సేకరణ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ సర్వేలో మరోసారి అధికార ఎన్డీఏకే ప్రజలు పట్టం కడుతున్నట్లు తెలిపింది. దాదాపు 48.9 శాతం మంది ఎన్డీఏకు మద్దతు ఇచ్చారు. భారతీయ జనతా పార్టీ, జనతాదళ్ (యునైటెడ్), ఇతర చిన్న పార్టీలతో కూడిన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మెజారిటీ సాధించే దిశగా పయనిస్తోందని సంస్థ పేర్కొంది. 35.8 శాతం మంది రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్, వామపక్ష పార్టీల మహాఘటబంధన్‌కు ఓటు వేస్తామని చెప్పారని స్పష్టం చేసింది. ఆశ్చర్యం ఏంటంటే ముఖ్యమంత్రిగా తేజస్వి యాదవ్‌కు ఎక్కువ మద్దతు లభించింది. సీఎంగా తేజస్వి యాదవ్‌నే కోరుకున్నారు. రెండో స్థానంలో నితీష్ కుమార్ ఉన్నారు. ఇక 43.6 శాతం మంది పురుషులు ఎన్డీఏకే మద్దతు ఇచ్చారు. అలాగే మహిళలు కూడా బీజేపీ కూటమికే సపోర్టు చేశారు. ఎన్డీఏ కూటమికి ఓటు వేస్తామని చెప్పారు కానీ.. నితీష్‌ను మాత్రం మరోసారి సీఎంగా అంగీకరించలేదు. 38.3 శాతం మంది తేజస్విని సీఎంగా కావాలని కోరుకోగా.. 35.6 శాతం మంది నితీష్‌ను కోరుకున్నారు. ఇక 4.6 శాతం మంది చిరాగ్ పాశ్వాన్‌ను, 2.3 శాతం మంది ప్రశాంత్ కిషోర్‌ను ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. 12.3 శాతం మంది బీజేపీ నుంచి కొత్త ముఖ్యమంత్రిని చూడాలని కోరుకున్నారు. యాదవులు, షెడ్యూల్డ్ తెగలు, ముస్లింలు తేజస్వి కూటమికి మద్దతు తెల్పగా.. మిగతా అన్ని సంఘాలు ఎన్డీఏ వైపు ఉన్నాయి. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నవంబర్-డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

## వైఎస్ జగన్ చిత్తూరు జిల్లా పర్యటనకు అనుమతి..
### షరతులు వర్తిస్తాయి..!



**అమరావతి,:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు అనుమతి ఇచ్చారు పోలీసులు.. 9వ తేదీన బంగారుపాళ్యం పర్యటనకు అనుమతి ఇచ్చారు చిత్తూరు జిల్లా పోలీసులు అయితే, అనుమతి ఇస్తూనే.. కొన్ని షరతులు పెట్టారు.. 9వ తేదీన బంగారుపాళ్యం పర్యటనకు జగన్ వెళ్లనుండగా.. బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ చిన్నది కావడంతో ఐదువందల మందికి మాత్రమే అనుమతి ఇస్తున్నట్టు పేర్కొన్నారు పోలీసులు.. నిత్యం మామిడి రైతులు మార్కెట్ యార్డుకు వస్తున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా పోలీసులు అనుమతి ఇచ్చారు.. ఇక, హెలిప్యాడ్ వద్ద కేవలం 30 మందికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు పోలీసులు.. ఇప్పటికే హెలిప్యాడ్‌కు కూడా అనుమతి ఇచ్చారు పోలీసులు.. మరోవైపు, ఎలాంటి ర్యాలీలు, రోడ్డు షోలు చేయకూడదని స్పష్టం చేశారు.. ఈ మేరకు వైసీపీ నేతలకు సమాచారం ఇచ్చారు పోలీసులు.. గత అనుభవాలు, ఘటనలు దృష్టిలో పెట్టుకుని అత్యంత జాగ్రత్తలు పాటిస్తున్నారు పోలీసులు.. అయితే, పదివేల మందితో వెళ్లడానికి అనుమతి కోరారు చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు.. కానీ, మార్కెట్ చిన్నది కావడం.. మరోవైపు, రైతులు కూడా నిత్యం పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు వస్తుండడంతో.. వైఎస్ జగన్ పర్యటనకు అనుమతి ఇస్తూనే.. షరతులు పెట్టారు పోలీసులు.. అయితే, పోలీసులు నిర్ణయంపై ఇంకా వైసీపీ నేతలు స్పందించలేదు..

### సిగాచీ ఘటన.. ఆ 8 మంది కార్మికుల కడసారి చూపు కష్టమేనా...?



సంగారెడ్డి: పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఆచూకీ లభించని కార్మికులు ఏమయ్యారో తెలియని పరిస్థితి. రెస్క్యూ బృందాలు కర్మాగారంలో భవనాల శిథిలాల తొలగింపు వేగవంతం చేసినా ఫలితం దక్కడం లేదు. దీంతో తమ వారి కోసం కార్మికుల కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రమాదం జరిగి 8 రోజులవుతున్నా.. రాహుల్, రవి, వెంకటేశ్, ఇర్ఫాన్, విజయ్, అఖిలేశ్, జస్టిన్, శివాజీల ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో ఐలా సెంటర్ వద్ద తమ వారి కోసం కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. చివరి చూపైనా దక్కుతుందేమోనని ఆశతో వారు రోజు ఇక్కడికి వస్తున్నారు. గల్లంతైన ఎనిమిది మంది విషయంలో డీఎన్ఏ రిపోర్టులు కీలకంగా మారనున్నాయి. 70కి పైగా నమూనాలను డీఎన్ఏ రిపోర్టుల కోసం అధికారులు పంపారు. మరోవైపు మంగళవారం పాశమైలారం సిగాచీ పరిశ్రమకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ బృందం రానుంది. ఘటనా స్థలాన్ని NDMA బృందం పరిశీలించనుంది. పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఎస్‌డీఎంఏతో కలిసి అధ్యయనం చేయనుంది. ప్రమాదానికి గల కారణాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇవ్వనుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు చేయనుంది

# భారత్‌లో 81 కోట్ల మందికి ఉచిత ఆహారమే గతి!



భారత్.. ప్రపంచంలోని 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ సంపదలో ప్రజల మధ్య అంతరం మాత్రం నానాటికీ పెరుగుతోంది. ఇక పేదరిక నిర్మూలన అనేది సుదూర కల. ఎందుకంటే.. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా చెప్పుకుంటున్న జీడీపీ వృద్ధిరేటు ఈ అసమానతలను తగ్గించడం లేదు. దీంతో ఆదాయ అసమానతలను రూపుమాపకుండా పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాదని తేలిపోయింది. జీడీపీలో పెరుగుదల ఉన్నప్పటికీ నిరుద్యోగం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఉచిత ఆహార పథకం మీద 81 కోట్ల మంది ఆధారపడి ఉన్నారంటే.. దేశ ఆర్థిక పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే.. కార్మి క చట్టాల అమలుతోపాటు అనేక చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

### ధనిక దేశంలో పేద విధానాలు

దేశంలో విధానపరమైన లోపాలు పేద, ధనిక అంతరాన్ని మరింత పెంచుతున్నాయి. ఆర్థిక వృద్ధిలో అగ్రవాటా దేశంలోని కేవలం 5శాతం మందికి మాత్రమే ప్రయోజనం చేకూరుస్తోంది. ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుకొంటున్న భారత్‌లో.. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద.. 81.35 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు చెల్లించాల్సి వస్తుందంటే మన అభివృద్ధి నమూనా ఎలాంటిదో అర్థమవుతుంది.

### అమలు కాని కనీస వేతన చట్టం..

కనీస వేతనాల గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే ఇది బహిరంగ రహస్యం. ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) చట్టాల కింద యజమానులు సమర్పించిన రిటర్న్‌లు చూస్తే పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. ఇంకా కొన్ని విభాగాల్లోని కార్మికులు ఈ రెండింటిలో నమోదే కాలేదు. 1970 కాంట్రాక్ట్ లేబర్ నియంత్రణ, రద్దు చట్టం వచ్చింది. కానీ.. ఐదు దశాబ్దాలైనా పరిశ్రమల్లో అమలు కాలేదు. అంతర్-రాష్ట్ర వలస కార్మికుల పరిస్థితి అత్యంత దుర్భలంగా ఉంది. సమాన పనికి సమాన వేతనం, ప్రయాణ చెల్లింపులు, వసతి, ఉచిత వైద్య సౌకర్యాలు వంటివి కాగితాలకే పరిమితమయ్యాయి.

### చెల్లింపులో లింగ అంతరం..

వేతనాల్లో స్త్రీ, పురుషుల మధ్య అంతరం కొనసాగుతూనే ఉంది. జెండర్‌తో సంబంధం లేకుండా సమాన పనికి సమాన వేతనం అందించాలని 1976 సమాన వేతన చట్టం చెబుతున్నా... దేశంలోని అత్యున్నత న్యాయస్థానం తీర్పులున్నా.. వివక్ష కొనసాగుతూనే ఉంది. అన్ని రంగాలలో మహిళలు ఒకే పనికి పురుషుల కంటే తక్కువ సంపాదిస్తూనే ఉన్నారు. ఈ అంతరాలు పోవాలంటే.. విధానాలు, చట్టాల అమలులో కఠినంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు.

### అపరిమిత పని గంటలు..

దేశంలో జీడీపీ పెరుగుదల ఉన్నప్పటికీ నిరుద్యోగ యువత ఎక్కువగా ఉంది. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల వారిలో నిరుద్యోగిత రేటు పట్టణ ప్రాంతాల్లో 17.9%, గ్రామీణ ప్రాంతాల్లో 13.7% ఉందని గణాంకాల మంత్రిత్వ శాఖ ఈ సంవత్సరం మే నెలలో తెలిపింది. కార్మికులకు 8 పని గంటలకోసం ఎన్ని ఉద్యమాలు జరిగాయో తెలిసిందే. అయినా.. ఇప్పటికీ అసంఘటిత, అనధికారిక రంగాల్లోని కార్మికులు రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేస్తారు. వీటికి అదనపు చెల్లింపులేమీ ఉండవు. చట్టం ప్రకారం రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల పని గంటలను రోజుకు 8 గంటలు, వారానికి 48 గంటలకు పరిమితం చేస్తే ఎక్కువ మందికి ఉపాధిని కల్పించవచ్చు.

### పేదరికాన్ని తగ్గించాలంటే..

కనీస పెన్షన్‌ను పెంచాలంటున్నారు నిపుణులు. 2004లోనే స్టాండింగ్ కమిటీ ఆన్ లేబర్ దీనిని సిఫార్సు చేసింది. రెండు దశాబ్దాలు దాటినా.. పెన్షన్ రూ.1,000 దగ్గరే ఉంది. కొన్ని రాష్ట్రాలు సీనియర్ సిటిజన్లకు ఇస్తున్న సామాజిక పెన్షన్ రూ. 4,000 కంటే కూడా చాలా తక్కువ. ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్లు డిమాండ్ చేసినట్లుగా రూ. 7,000కి పెంచడం వల్ల లక్షలాది మంది జీవిత చరమాంకంలో గౌరవంగా జీవించగలుగుతారు. ఉపాధి హామీ పథకం పని రోజులను 150కి పెంచాలని, వేతనాన్ని రూ.400కు పెంచాలంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని సూచిస్తున్నారు.

# కాసిన్ని రొట్టెలు



'రొట్టెపై కవిత గట్టేంత సాహసం చేయలేను. కాని మిమ్మల్ని ఆ నిప్పుల పొయ్యి వరకూ రమ్మని ఆహ్వానిస్తాను. అక్కడ తినడానికి సిద్ధమవుతున్న రొట్టెను దర్శించమని, ఆ అద్భుతాన్ని తిలకించమని వేడుకుంటాను' అంటాడొక హిందీ కవి. సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, ఆకాశహర్మ్యాలు, విమానం టికెట్టులు, లాకర్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, మురుగు పొంగితే ఇష్టరీతిన చుట్టుముట్టినట్టు చేరే అసమంజస ధనం... ఇవి కొందరికి అద్భుతంగా తోచవచ్చు. కాని ఆకలిగొన్నవాడికి పొయ్యి మీద కాలుతున్న రొట్టె కంటే అద్భుతమైనది మరొకటి ఉండదు. ప్రతి పూటా అది అపురూపమే. అందుకే కవి అంటాడు- 'ప్రతిసారీ ఇంతకు ముందు కంటే మరింత రుచిగా ఉంటుంది. ప్రతిసారీ ఇంతకు ముందు కంటే ఎంతో గుండ్రంగా అగుపిస్తుంది. ఆకలి గురించి అగ్ని పలికే గొప్ప వాంగ్మూలం కదా రొట్టె'....బైబిల్‌లో రొట్టె కేవలం రొట్టె కాదు. జీవితానికి సంకేతం. జీవితానికి ఏమి కావాలి? పంచడం... పంచుకు తినడం తప్పు. 'ప్రభూ... వారిని ఇంటికి వెళ్లమని చెప్పు. వాళ్లు వెళితే వారి వారి రొట్టెలు సంపాదించుకు తినగలరు' అని శిష్యులు ఏసు ప్రభువుకు చెబుతారు. అప్పటికే వారంతా ఎడారి వంటి ప్రాంతంలో ఉన్నారు. ఏసు వెంట ఐదు వేల మంది ఉన్నారు ఆయన ఆరాధనలో. వారంతా ఇళ్లకు వెళ్లి రొట్టెలు ఎప్పటికి తినాలి? 'మన వద్ద ఏం ఉన్నాయి?'... 'ఒక బాలుడి బుట్టలో ఐదు రొట్టెలు, రెండు చేపలు'.... కరుణామయుడి హృదిలో సాటి మనిషి ఆకలి పట్ల ఎంతటి కరుణ ఉంటుందంటే ఆ ఐదు రొట్టెలు, రెండు చేపలే ఐదువేల మందికి సరిపోతాయి. పరిమళా సోమేశ్వర్ రాసిన 'రొట్టె కోసం' అనే కథలో ఆకలిగొన్న పేదబాలుడు ఇంటింటికీ తిరుగుతూ రొట్టె కోసం అంగలారుస్తాడు. ఒక డబ్బున్న మహిళ రోజూ రొట్టెలు చేసి కాకులకు వేయడం వాడికి తెలుసు. ఆ రోజున కాకులకు బదులుగా తను దక్కించుకోవాలని ప్రయత్నిస్తే ఆ మహిళకు ఎంత కోపం వస్తుందో. 'ఫో... వెధవా' అని తరిమి కొడుతుంది. కాకులకు వేస్తే పుణ్యంగాని ఇలాంటి వెధవలకు వేస్తే ఏం పుణ్యం? వివిన మూర్తి రాసిన 'రొట్టె ముక్క' అనే కథలో కడుపుతో ఉన్న దళితురాలికి రొట్టె ముక్క తినాలని మనసులో పడుతుంది. మినపరొట్టె. ఆ చిన్న కోరిక తీరడం, తీరకపోవడం వెనుక జాతుల దోపిడి అంతా ఉంది. మనుషుల్ని దొంగలుగా మార్చడం రొట్టె ప్రధానంగా చేసే పని. విక్టర్ హ్యూగో ప్రఖ్యాత నవల 'లే మిజరబుల్స్'లో ప్రధాన పాత్ర జీన్ వాల్‌జీన్ రొట్టెను దొంగిలించడంతో ఆ నవల తర్వాతి ఘటనలన్నీ రూపు కడతాయి. జీన్ వాల్‌జీన్ రొట్టెను దొంగిలించింది కుటుంబం ఆకలి తీర్చడం కోసం. గమ్మత్తు ఏమిటంటే ఈ నాగరిక ప్రపంచపు నిర్మాణమంతా రొట్టెను న్యాయంగా దక్కనీకపోవడంపై ఆధారపడి ఉంది. ఇచ్చే చేయి ఒకరిదిగా పుచ్చుకునే చేయి మరొకరిదిగా ఉంచడం వల్ల ప్రపంచంలోని కొద్దిపాటి కుబేర సంతతి బతుకు ఈడ్చగలుగుతుంది. ఈ కుబేరులు కుబేరుల్లా ఉండటానికి మొదట జనానికి రొట్టె లేకుండా చేస్తారు. జనం రొట్టె తినే పరిస్థితిలో ఉంటే గనక యుద్ధాలు తెచ్చి ఇళ్లనూ, వంటగృహాలను ధ్వంసం చేస్తారు. రొట్టెకై అలమటించి జనం చస్తున్న సమయాల్లో కుబేరుల ఇళ్లలోని చలినెగళ్లు మరింత ఎర్రగా నాల్కలు సాచి వెచ్చదనం ఇస్తాయని వారూ వీరూ చెప్పడమే! 'తిండి లేని పిల్లలున్న దేశంలో పాలు నల్లగా ఉంటాయి. పిల్లలకు తిండి లేని దేశాల్లో రొట్టెలు రాళ్లలా ఉంటాయి' అని రాస్తాడు వాద్రేవు చినవీరభద్రుడు. నక్సలైటు పేరుతో అమాయకుణ్ణి తెచ్చి, ఇంటరాగేషన్ పేరుతో నాలుగు రోజులుగా ఆకలికి మాడుస్తుంటే తన వద్ద ఉన్న రొట్టెలను అతడికి రహస్యంగా పెట్టడం గురించి కన్నీళ్లతో రాస్తారు సత్యమూర్తి అలియాస్ శివసాగర్. 'రొట్టె చేసేందుకు రైతు శ్రమిస్తున్నాడు. రొట్టెతో ఆకలి తీర్చుకునే సామాన్యుడు శ్రమిస్తున్నాడు. కాని రొట్టెతో ఆడుకునే పెద్దమనుషులు పెద్దలసభలో కూచుని ఉన్నారే' అని సుధామా పాండే ధూమల్ రాసిన ప్రఖ్యాత కవిత 'రోటీ ఔర్ సన్సద్' ఆలోచనలను రేకెత్తిస్తూనే ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా 80 కోట్ల మందికి రొట్టెగ్రాసం ఇస్తున్నామని చెప్పుకుంటున్న ఈ దేశంలో ఆ స్థితిని యథాతథంగా ఉంచడానికి కారణం తగిన సాహిత్యం పుట్టడానికే కాబోలు. లేకుంటే మనకేం తక్కువ. జూలై 6 నుంచి నెల్లూరులో రొట్టెల పండగ మొదలయ్యింది. అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది పాల్గొని అక్కడి 'బారా షహీద్ దర్గా' వద్ద వున్న చెరువులో మోకాటి లోతున దిగి ఒకరి నుంచి మరొకరు రొట్టెలు మార్చుకుంటారు. ఏం రొట్టెలు అవి? 'సంతానం రొట్టె', 'సౌభాగ్యం రొట్టె', 'ఆరోగ్యం రొట్టె', 'ఉద్యోగం రొట్టె', 'సొంతింటి రొట్టె', 'పెళ్లి రొట్టె', 'చదువు రొట్టె'.... అందరివీ చిన్న చిన్న కోరికలు... చిన్న చిన్న ఆశలు... చిన్న చిన్న ఆకాంక్షలు.... ప్రపంచంలోగాని, ఈ దేశంలోగాని, ఏ నైసర్గికతలోగాని కోటాను కోట్ల సామాన్యులకు ఇంతకు మించిన కోరికలు ఉండవు. వారంతా 'దో వక్తకీ రోటీ' దొరికి జీవితం చీకూ చింతా లేకుండా గడిచిపోతే చాలనే కోరుకుంటారు. ఈ మందభాగ్యులను పాలించడానికి కర్కశత్వం అవసరమా? కరుణ సరిపోదా?


# మానవతా విధ్వంసం



"రక్తం రుచిమరిగిన మృగ విన్యాసం, గాజా వీధుల్లో పగిలిన గుండెల ధ్వని, ఇసుక రేణువుల్లా రాలే కన్నీటి జ్వాల, ఇజ్రాయిలూ! నీ నేల కరుణామయుడు పుట్టా డంటే ఎలా నమ్మాలి!" అంటాడు, గాజా అమాన వీయ దృశ్యాన్ని చూసిన కవి. నిజమే కదా! కనీసమైన మానవ లక్షణమూ కనిపించకుండా జరుగుతున్న దానవకాండకు ఇప్పుడీ ప్రపంచమంతా సాక్షి. ప్రపంచంలోని దేశాలన్నింటిలో గాజా ప్రజలతో పాటుగా జీవిస్తున్న ఎనిమిది వందల కోట్ల మంది ప్రజలు చూస్తుండగానే దారుణ మారణకాండ సాగిపోతున్నది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి ఏడాది దాటింది. ఆధునిక ప్రపంచంలో దేశాలు, ప్రజలు ఎలా జీవించాలో, సంబంధాలు ఏ విధంగా కొనసాగించాలో కొన్ని నియమాలను, సూత్రాలను నిర్దేశించుకున్నాయి. మన పురాణాలు, కావ్యాలు, రాజుల కథలు, రామాయణ మహా భారతాలు ఏవి చదివినా చట్టాలు, న్యాయాలు, నీతులు, కొన్ని పద్ధతులు కనిపిస్తాయి. అయితే వాటిల్లో దుర్మార్గం, దుష్టత్వం చూస్తాము! కానీ ఇద్దరు రాజుల మధ్య, రాజ్యాల మధ్య యుద్ధం వచ్చినప్పుడు సైన్యంతో తలపడేవారు. ఒక నీతికి బద్ధులుగా ఉండేవారని చెప్పుకుంటాము. యుద్ధంలో స్త్రీల, పిల్లల, బలహీనుల జోలికి వెళ్లేవారు కాదు. లొంగి పోతున్నామని చేతులెత్తితే చంపేవాళ్లూ కాదు. అయినా ఈ యుద్ధాల్లో చిందే రక్తపాతాన్ని, విధ్వం సాన్ని చూడలేకే సిద్ధార్థుడు శాంతినెలా సాధించాలోనని సత్యాన్వేషణ కోసం రాజ్యం విడిచి వెళ్లి బుద్ధుడిగా జ్ఞానాన్ని సముపార్జిం చాడు. అది వేరే విషయం. కానీ రాజ్యం అనే నిర్మాణంలోనే ఆక్రమణ, యుద్ధం అనివార్యమవుతున్నాయి. రాజ్యం యొక్క లక్ష్యం సంపదపై ఆధిపత్యమే కనుక, విధ్వంసం, అమానవీయత అనివార్య ఫలాలు మిగిలాయి. రాజ్యాలు నశించి, ప్రజాస్వామ్య ఆధునిక భావనలు అభివృద్ధి చెందాక సహజీవనం, సౌభ్రాతృత్వం, సహకారం, సమత వైపు ప్రజలు అడుగులేస్తున్న తరుణంలో ఒక సంవత్సరకాలంగా ఒక దేశం ఇంకో దేశంపై దాడులు చేస్తూ మనవ హననానికి పాల్పడటం దారుణమైన విషయం. ప్రతిరోజూ, ప్రతిక్షణం, ఎప్పుడు ప్రాణాలు పోతాయో, ఏ బాంబు పేలుతుందో తెలియని ఆందోళన, నరకయాతనలో గాజాలోని ప్రజలు అనుభవిస్తున్నారు. సాధారణ పౌరులు, మహిళలు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ప్రజలంతా విలవిల్లాడుతున్నారు. జరుగుతున్న యుద్ధ కారణాలకు వారేమీ సంబంధీకులు కాదు. అందరిలానే బతికే హక్కున్న ప్రజలు. అసలు ఇది యుద్ధమే కాదు. యుద్ధమంటే రెండుపక్షాలూ తలపడాలి. ఇక్కడ ఏకపక్షంగా జరుగుతున్న పాశవిక దాడి మాత్రమే. ప్రజలపై రెండు రకాలుగా యుద్ధం జరుగుతున్నది. ఒకటి బాంబులు, క్షిపణులు వేసి చంపేయడం. రెండు పరోక్షంగా అక్కడున్న ప్రజలకు, పసిపాపలకు ఆహారం, నీళ్లు దొరక్కుండా, అందకుండా చేసి చంపడం. అంతేకాదు అనారోగ్యంతో బాధపడేవారికి చికిత్స, మందులు అడ్డుకుని చనిపోయేలా చేయడం. అందరం అంగీకరించి ఆమోదించుకున్న అతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తూ అమానవీయ దాడిని ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్నది. పాలస్తీనాలో మానవతా సంక్షోభం ఏర్పడిందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటైస్ స్వయంగా ఆందోళన వ్యక్తం చేశాడు. గత కొన్నిరోజుల్లో ఇజ్రాయిల్ సైన్యం బెదిరింపులకు భయపడి దాదాపు ముప్పయివేల మంది ప్రజలు అభద్రజీవులై తమ గూడు వొదిలిపోయారు. ఆశ్రయం, ఆహారం, ఔషధాలు, నీరు వంటి ప్రాథమిక అవసరాల్లేక ప్రజలు తల్లడిల్లుతున్నారు. అంతర్జాతీయ సంస్థలు, సహాయ బృందాలు వారికి ఆహారం అందించడానికి వెళ్తే వారినీ నిర్బంధిస్తున్నారు. సహాయం అందుకోవడానికి వచ్చి అన్నార్తులపై తుపాకులు ఎక్కుపెట్టి చంపేస్తున్నారు. అట్లా వేలాదిమంది పాలస్తీనియన్లు చనిపోయారు. ఇప్పుడు కొంతకాలంగా గాజాకు ఇంధన సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఇంక్యుబేటర్లు మూతపడ్డాయి. రోగులు మృత్యువాత పడుతున్నారు. ఆకలితో పసి పిల్లలు రోధిస్తున్నారు. ఇసుకతో కడుపును నింపుతున్న దృశ్యాలు మనుషులె వరినైనా చలింపచేస్తాయి. యుద్ధనీతికి, అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ దాడి అమానవీయమైనది. ఇలాంటి అమానవీయదాడికి పాల్ప డుతున్న ఇజ్రాయిల్‌కు అండదండలు అందిస్తున్నది అమెరికా. మొన్న ఇరాన్‌పై యుద్ధానికీ ఇజ్రాయిల్ సై అని చావు దెబ్బ తిన్నది. ఇరాన్ కూడా ధీటుగా జవాబివ్వడంతో, ఆ దేశ ప్రజలు కూడా సారీ ఇరాన్ అని క్షమార్పణ కోరాయి. అక్కడి ప్రజలకు యుద్ధ విధ్వంసం తెలిసొస్తే తప్ప ఆ పరిస్థితి రాలేదు. కానీ ఏడాదికాలంగా పాలస్తీనా గాజాపై విధంసాన్ని సృష్టిస్తున్న ఇజ్రాయిల్ ఆగడాలను ప్రపంచం తీవ్రంగా ఖండించాల్సి ఉన్నది. ధర్మం, నీతిసూత్రాలను నిత్యం వల్లించే మనదేశ ప్రధాని, ఇంత అమానవీయం చోటుచేసుకుంటున్న గాజా విషయమై నోరు విప్పడం లేదు. ఎప్పటినుంచో పాలస్తీనాకు మనకూ ఉన్న సత్సంబంధాలను సైతం నిరాకరించి అమెరికా, ఇజ్రాయిల్‌తో అంట కాగడం, దేశానికి చెడ్డపేరు తెస్తున్నది. ప్రపంచమూ, ఇంతమంది మనుషులం చూస్తుండగానే మానవతా ధ్వంస రచన జరగడం అత్యంత బాధాకరం. గాజాకు మద్దతుగా నిలవడం కనీస మానవ ధర్మం.

# మళ్లీ వాయిదా





'ఘాటి' మూవీ విడుదల వాయిదా పడినట్లు యూవీ క్రియేషన్స్ తాజా నోట్ ద్వారా సంకేతాలిచ్చింది. సినిమా ఓ జీవ నది లాంటిది అంటూ భావోద్వేగపూరితంగా చెప్పిన ఈ పోస్ట్ నెటిజన్లను విసిగించింది. మూవీ రిలీజ్ వాయిదా వేస్తుంటే మామూలుగా చెప్పొచ్చు కదా.. ఇంత డ్రామా అవసరమా?" అంటూ సోషల్ మీడియాలో ఫైర్ అవుతున్నారు. జూలై 11 రిలీజ్ అని మేకర్స్ ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ట్రైలర్ లేకపోవడం ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. గ్రాఫిక్స్ వర్క్ ఇంకా పెండింగ్ కావడం వల్లే వాయిదా వేసినట్లు సమాచారం.

టాలీవుడ్‌లో పెద్ద సినిమాల వాయిదాల పర్వం కొనసాగుతోంది. మెగాస్టార్ 'విశ్వంభర' ఎప్పుడొస్తుందో కూడా అర్థం కావడం లేదు. అనుష్క శెట్టి , క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్లో తెరకెక్కిన ' ఘాటి ' చిత్రం మళ్లీ వాయిదా పడింది. ఇప్పటికే ఎన్నోసార్లు వాయిదా పడిన ఈ మూవీ మరోసారి వెనక్కి వెళ్లడం ఫ్యాన్స్‌ని హర్ట్ చేస్తోంది. ఈ విషయాన్ని యూవీ క్రియేషన్స్ అధికారికంగా వెల్లడించింది. ఈ పోస్టు చూసిన నెటిజన్లు మూవీ రిలీజ్ వాయిదా వేస్తున్నట్లు నేరుగా చెప్పొచ్చు కదా.. ఇంత డ్రామా అవసరమా? అని మేకర్స్‌ని ప్రశ్నిస్తున్నారు. వాయిదా వేస్తే వేశారు కనీసం ట్రైలర్ అయినా రిలీజ్ చేయొచ్చు కదా అని అడుగుతు న్నారు. మరికొందరైతే యూవీ క్రియేషన్స్‌కి సినిమాలు తీయడం తప్ప.. టైమ్‌కి రిలీజ్ చేయడం చేతకాదని, సినిమాలు మానేసి వేరే ఏదైనా పని చేసుకోవచ్చు కదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.'ఘాటి' మూవీని జులై 11న రిలీజ్ చేస్తున్నట్లు గత నెలలోనే మేకర్స్ ప్రకటించారు. అయితే టైమ్ దగ్గర పడుతున్నా రిలీజ్‌కి సంబంధించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోవడం, ట్రైలర్ రిలీజ్ కూడా లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశ చెందారు. ఈ నేపథ్యంలోనే మూవీ మళ్లీ వాయిదా పడుతోం దని కొద్దిరోజులుగా వార్తలొస్తున్నాయి. దీనిపై ఏదొక క్లారిటీ ఇవ్వాలని మేకర్స్‌ని ఆడియన్స్ కోరుతున్నారు. దీంతో ఎట్టకేలకు యూవీ క్రియేషన్స్ స్పందించి ఓ నోట్ విడుదల చేసింది. గ్రాఫిక్స్ వర్క్ ఇంకా పెండింగ్ ఉండటం వల్లే 'ఘాటి'ని వాయిదా వేయడం తప్పలేదని అంటున్నారు. రిలీజ్ టైమ్‌కి ఎలాగైనా వర్క్ పూర్తి చేయాలని మేకర్స్ తొందరపెట్టినా టెక్నికల్ టీమ్ చేతులెత్తేసిందట. దీంతో 'ఘాటి' రిలీజ్ వాయిదా వేయక తప్పలేదని అంటున్నారు. ప్రస్తుతం వీరిద్దరి కాంబోలో వస్తోన్న 'ఘాటి' చిత్రం రిలీజ్‌కి ముందే లాభాలు తెచ్చిపెట్టిందట. 'ఘాటి' రూ.35 కోట్ల బడ్జెట్‌తో తీస్తే ప్రీ రిలీజ్ బిజినెస్ ద్వారా రూ.50 కోట్ల వరకు వచ్చిందట. థియేట్రికల్ రైట్స్ ద్వారా రూ12కోట్లు, ఓటీటీ, ఆడియో రైట్స్ ద్వారా రూ.38 కోట్ల వరకు వచ్చినట్లు తెలుస్తోంది.



# మీకెందుకు



ఈ తరం అమ్మాయిలు పెళ్లి కంటే కెరీర్‌పైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారన్నది కాదనలేని విషయం. ఇంతకు ముందు 16, 18 ఏళ్లకే అమ్మాయిలను పెళ్లీడుకొచ్చారనే వారు. ఇప్పుడు అంతా మారిపోయింది. 21 ఏళ్లు దాటిన తరువాతనే పెళ్లిపై ఆసక్తి చూపుతున్నారు. అయితే సినిమా రంగంలో అయితే 35 దాటిపోతోంది. చాలా మంది హీరోయిన్లు మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌గానే ఉంటున్నారు. అలాంటి వారిలో నటి రెజీనా ఒకరు. ఈమె బహుభాషా నటి. తమిళం, తెలుగు, కన్నడం భాషల్లో కథానాయకిగా నటించి పాపులర్ అయ్యారు. ముఖ్యంగా తమిళంలో 2005లో విడుదలైన కండనాళ్ మొదల్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత నటించిన అసుర చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టినా, శివకార్తికేయన్‌కు జంటగా నటించిన కేడీబిల్లా కిల్లాడి రంగా చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత తెలుగు, కన్నడం భాషల్లోనూ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అయితే కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదనే చెప్పాలి. దీంతో ప్రత్యేక పాటల్లో నటించడంతోపాటు ప్రతినాయకి పాత్రల్లో నటించడానికి సై అన్నారు. అదే సమయంలో వెబ్ సిరీస్‌లోనూ నటించడం ప్రారంభించారు. ఇలా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్న రెజీనా చాలా బోల్డ్ నటి అనే ముద్ర వేసుకున్నారు. అందాలారబోతకు నో చెప్పని ఈ భామ వయసు 34 ఏళ్లు. ఈమె తమిళంలో చివరిగా నటించిన చిత్రం విడాముయర్చి. అందులో నెగిటీవ్ పాత్రలో నటించా రు. కాగా ఇటీవల ఒక భేటీలో 34 ఏళ్లు వచ్చాయి. పెళ్లెప్పుడు చేసుకుంటారన్న ప్రశ్నకు ముక్కు సూటిగా బదులిచ్చిన రెజీనా పెళ్లెప్పుడు చేసుకుంటావని తన తల్లే అడగదని, మీరెందుకు అడుగుతు న్నారు? మీకెందుకు అంత అక్కర అని చెప్పింది. అంతే కాకుండా తనతో ఎవరైనా సంబంధం పెట్టుకుంటే వారికే కష్టం అనీ, అందుకే ఫ్రెండ్‌షిపే బెటర్ ఈజీగా ఉంటుందని చెప్పారు. దీంతో నెటిజన్లు ఈ అమ్మడిపై రకరకాల ట్రోల్స్ చేస్తున్నా రు.అసలు జీవితంలో పెళ్లి చేసుకుంటారా? అవివాహి తగానే ఉండిపోతారా? అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# దమ్మున్న హీరోను తొక్కేయాలని..





సినిమా ఇండస్ట్రీలో నటీనటుల మధ్య పోటీ ఎప్పుడూ ఉండేదే! అయితే కొత్తగా వచ్చే హీరోహీరోయిన్స్ ఎదుగుతున్నారంటే కొందరు బడా స్టార్స్ అస్సలు తట్టుకోలేరు. హీరో కార్తీక్ ఆర్యన్ విషయంలో ఇదే జరిగిందంటున్నాడు సింగర్ అమాల్ మాలిక్.

సినిమా ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉంటాయో జనాలకు అర్థమవుతోంది. ఇక్కడ చీకట్లోనే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్. . దాన్ని ఎదిరించలేకపోయాడు. అతడిది ఆత్మహత్య అని కొందరు, హత్య అని మరికొందరు అంటుంటారు. ఏదేమైనా అతడు మనమధ్య లేడనేది నిజం. ఈ పరిశ్రమ వారి మనసును, మెదడును దెబ్బతీస్తుంది. ఆత్మస్థైర్యాన్ని కోల్పోయే లా చేస్తుంది. సినిమా ఇండస్ట్రీ అనేదే ఒక మాయాప్రపంచం.

ఈ విషయం జనాలకు అర్థమయ్యాక బాలీవుడ్‌పై వారి అభిప్రాయమే మారిపోయింది. వీళ్లు చెడ్డవాళ్లు.. ఊరికే వదిలిపెట్టకూడదు అని జనాల్లో కోపం కట్టలు తెంచుకుంది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంతో సెలబ్రిటీలను, వారి సినిమాలను ప్రజలు దూరం పెట్టారు. ఈ పతనాన్ని చూసేందుకు వారు నిజంగానే అర్హులు. ఒక మంచి మనిషి (సుశాంత్ సింగ్) మన మధ్య లేకుండా పోయాడు. కార్తీక్ ఆర్యన్‌ను కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తొక్కడానికి ప్రయత్నించారు. కానీ, అతడు చిరునవ్వుతోనే ఆ సమస్యలను జయించాడు. అతడికి పేరెంట్స్ సపోర్ట్ ఉంది. ఇండస్ట్రీకి కొత్తవాడయినా తన స్వయంకృషితో ఎదిగాడు. కార్తీక్‌ను ఇండస్ట్రీ నుంచి బయటకు పంపించేందుకు దాదాపు వంద మంది ప్రయత్నిస్తున్నారు. అందులో హీరోలు, నిర్మాతలు. ఉన్నారు అని చెప్పుకొచ్చాడు.

# అప్పుడు అర్థం అయింది

సమంత నటి సమంత రూటే వేరు. తనకు నచ్చినట్లు ప్రవర్తించే నటీమణుల్లో ఈమె ముందుంటుందని చెప్పవచ్చు. ఎప్పుడూ సోషల్‌మీడియాతో తన అభిమానులకు ఆమె టచ్‌లో ఉంటారు. తనకు నచ్చిన ప్రతి విషయాన్ని ఆమె పంచుకుం టారు. విడాకులు, మయోసైటిస్ ఇలా తన జీవితంలో ఎదురైన క్లిష్ట పరిస్థితుల గురించి కూడా అందులో వ్యక్తపరుస్తూ ఉంటారు. తాజాగా తాను ఎవరూ..? ఎంత పెద్ద సెలబ్రిటీ..? జీవితంలో ఏం సాధించానో తెలుసుకున్నానని చెప్పుకొచ్చారు.

విడాకులు పొందిన సమంత ఆ తరువాత మయోసైటీస్ అనే అరుదైన వ్యాధికి గురై దాని నుంచి బయట పడటానికి పెద్ద పోరాటమే చేశారు. అలా చాలా కాలం నటనకు దూరం అయిన ఈమె మళ్లీ నటించడానికి సిద్ధం అయ్యారు. అలా వెబ్ సిరీస్‌లో నటించిన సమంత ఇటీవల నిర్మాతగానూ అవతారమెత్తి శుభం అనే చిత్రాన్ని నిర్మించారు కూడా. ఇలా నిత్యం సామాజిక మాధ్యమాల్లో యాక్టీవ్‌గా ఉంటున్న సమంత తాజాగా సామాజిక మాధ్యమాల్లో మరో టీట్ చేశారు. అందులో తన చేతిలో ఎప్పుడూ సెల్‌ఫోన్ ఉంటుందన్నారు. దీంతో సడన్‌గా తనకొక ఆలోచన వచ్చిందనీ, దీంతో వెంటనే తన సెల్‌ఫోన్‌ను మూడు రోజుల పాటు స్విచ్ఛ్ ఆఫ్ చేసినట్లు చెప్పారు. ఆ మూడు రోజులు ఎవరితోనూ మాట్లాడలేదనీ, ఎవరినీ చూడలేదనీ, పుస్తకాలు చదవడం, రాయడం వంటివేవీ చేయలేదన్నారు. ఇంకా చెప్పాలంటే ఏ పని చేయలేదన్నారు.

అలా మూడు రోజులు మెదడుకు పూర్తిగా విశ్రాంతినిచ్చినట్లు చెప్పారు. ఆ అనుభవం చాలా కొత్తగా ఉందన్నారు. తన ఈగోలో చాలా భాగం తన సెల్‌ఫోన్‌తోనే అన్నది అప్పుడు అర్థం అయ్యిందన్నారు. తాను ఎవరూ? ఎంత సెలబ్రిటీనీ? ఏం సాధించాను? అన్న విషయాలు తన సెల్‌ఫోన్‌నే చెబుతుందన్నారు. అది లేని రోజున తాను ఒక సాధారణ జీవినని అనే భావన కలిగిందన్నారు. పుట్టుకకు గిట్టుటకు మధ్య కాలంలో సెల్‌ఫోన్ మనకు ప్రకృతికి చెందిన విషయాలను కనుమరుగు చేసిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మన పెద్దలకు, ఆరోగ్యానికి సెల్‌ఫోన్ ఎంత ఆటంకంగా మారిందన్నది అవగతం చేసుకున్నానని నటి సమంత అన్నారు. ఈమె చేసిన పోస్ట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# హైకోర్టులో సైఫ్‌కు చుక్కెదురు

మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఆయన కుటుం బానికి చెందిన రూ.15,000 కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీ గా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భోపాల్‌లో సైఫ్ కుటుంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంత మైన భవంతులు వారసత్వ ంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యం లో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తాత)ను వివాహమా డారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటుంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీ దా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తి స్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 20 15లో ప్రకటించింది.

# హిట్ కొట్టేలా..



సినిమా నుంచి తాజాగా ట్రైలర్ విడుదలైంది. ఈ ప్రేమకథ చిత్రానికి రామ్ గోదాల దర్శకత్వం వహించారు. ఈ సినిమాను వీ ఆర్ట్స్ బ్యానర్‌లో హరీశ్ నల్లా నిర్మించారు. జూలై 11న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను మెప్పించాయి. తాజాగా వచ్చిన ట్రైలర్ కూడా అంతే స్థాయిలో ఉంది. కామెడీ, లవ్, ఎమోషనల్ సీన్స్‌తో ట్రైలర్ కట్ ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. కాగా.. ఈ చిత్రంలో రవీందర్ విజయ్, బబ్లూ పృథ్వీ రాజ్, ప్రభాస్ శ్రీను, రఘు కారుమంచి, సాథ్విక్ ఆనంద్, నయని పావని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాధన్ సంగీతమందిస్తున్నారు.

Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555